గురువారం 22.10.2026
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 34 సంచిక - 181 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



స్థానిక సంస్థల బలోపేతంతో రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం. సకాలంలో ఎన్నికలతో 16వ ఆర్థిక సంఘం, కేంద్ర నిధులు అందుతాయి. నిర్దేశిత గడువులో ఎన్నికలు నిర్వహించి స్వపరిపాలన ద్వారా అభివృద్ధి చేపట్టాలి. ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సీపీ కుట్రలు చేస్తోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# శాంతిభద్రతలతోనే ప్రగతి

- భద్రతపై నమ్మకముంటేనే పెట్టుబడులు
- పరిశ్రమలు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు ప్రశాంత వాతావరణం కీలకం
- ఏపీ పోలీసులకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు రావాలి
- ఏఐ, డ్రోన్లతో నేరాల కట్టడికి చర్యలు

## పోలీసు అమరవీరుల సంస్మరణలో చంద్రబాబు







**మంగళగిరి, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్):** శాంతిభద్రతల పరిరక్షణలో ఏపీ పోలీసు శాఖ దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాక్షించారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, బాధితులకు భరోసా ఏర్పడాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవనం సాగించే పరిస్థితులు కల్పించాలని పోలీస్ శాఖకు సూచించారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో బుధవారం నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం పోలీసులను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ఖాకీ అంటే బాధ్యత.. పోలీసు అంటే భరోసా అని సీఎం పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి పోలీసులే ధైర్యం, స్థైర్యమని అన్నారు. ప్రమాదం జరిగినా, నేరం జరిగినా ముందుగా గుర్తుకొచ్చేది పోలీసులేనని చెప్పారు. ప్రజల ఇళ్లలో పండుగ వెలుగులు నింపేందుకు పోలీసులు తమ కుటుంబాల పండుగలకు దూరమవుతున్నారని అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రులు, విజయవాడ ఉత్సవ్, వీఐపీల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దసరా ఉత్సవాలను అత్యంత ప్రశాంతంగా ప్రజలు నిర్వహించు కోవటంలో పోలీసుల నిరంతర శ్రమ అభినందనీయమని అన్నారు. 1959 అక్టోబరు 21న లడఖ్‌లో చైనా సైనికుల దాడిని తిప్పికొడుతూ పదిమంది పోలీసులు వీరమరణం పొందారని, వారి త్యాగానికి గుర్తుగా ఏటా ఈ రోజును పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలను స్మరించుకోవడం కేవలం సానుభూతి కాదని, సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. మిగతా 2లో...

# స్థానిక పోరులో గెలుపే లక్ష్యం



- కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి
- అభ్యర్థుల ఎంపిక నుంచి ఫలితాల వరకు అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ నేతలు, శ్రేణులకు చంద్రబాబు పిలుపు

**అమరావతి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, బూత్ స్థాయి కార్యకర్తలతో ఆయన బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. మిగతా 2లో...

# కుట్రలతో ఎన్నికలను అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యం

- స్థానిక ఎన్నికలు శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా సహకరిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిర్వహించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వారు తెలిపారు.
2024 ఎన్నికల్లో రాష్ట్ర పునర్నిర్మాణం నినాదంతో ప్రజల ముందుకు వెళ్లామని, మిగతా 2లో...

# ధరల భారం పడనీయొద్దు

- నిత్యావసరాల ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- సామాన్యులకు అందుబాటులో ఉల్లి, బియ్యం
- సూర్యఘర్ లక్ష్య సాధనకు మరో 9 లక్షల కనెక్షన్లు
- అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

2 లో

# పల్లె పోరుకు నామినేషన్ల ఘట్టం

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- 21 నుంచి 23 వరకు నామపత్రాల స్వీకరణ
- నవంబరు 3న పోలింగ్.. 5న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

2 లో




# జనసేన అభ్యర్థనకు ఎస్ఈసీ ఓకే

- స్వతంత్రుల గుర్తుల జాబితా నుంచి రెండు చిహ్నాలు తొలగింపు
- గాజు గ్లాసును పోలి ఉన్నాయంటూ పార్టీ విజ్ఞప్తి
- గుర్తులు కేటాయించవద్దని రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు

2 లో




# తిరుమలలో సిఫార్సు లేఖలకు బ్రేక్

- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం నిలిపివేత
- లేఖలపై దర్శనాలు, గదుల కేటాయింపు రద్దు
- ప్రోటోకాల్ ప్రముఖులు స్వయంగా వస్తే మినహాయింపు
- టీటీడీ కీలక ప్రకటన

3 లో



# స్థానిక పోరుపై ఎస్ఈసీ దృష్టి

- సుప్రీంకోర్టు ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తం
- 19 పురపాలక సంస్థలపై కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష
- నామినేషన్ల ఫిర్యాదులు, ఆధారాలపై ఆరా
- తదుపరి కార్యాచరణపై ఎస్ఈసీ కసరత్తు

3 లో

# పరిషత్ పోరులో తొలి రోజే ఉద్రిక్తతలు



- పలుచోట్ల టీడీపీ-వైకాపా వర్గాల మధ్య ఘర్షణలు
- రాళ్లు, కర్రలతో దాడులు.. పోలీసుల లాఠీఛార్జి
- సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాల మోహరింపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజే పలు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో నామినేషన్ల దాఖలు సందర్భంగా టీడీపీ, వైఎస్సార్సీపీ వర్గాల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రాళ్లదాడులు, దాడులు జరగగా.. మరికొన్ని చోట్ల పోలీసులు ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులు చేపట్టారు.
కడప జిల్లాలో పలుచోట్ల ఉద్రిక్తత:లిలి కడప జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో మిగతా 3లో...

# నామినేషన్ల గడువు పెంపునకు నో



- రాష్ట్రవ్యాప్తంగా పొడిగించేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ
- ఫిర్యాదులున్న 19 ప్రాంతాల్లో పరిస్థితుల పరిశీలనకు ఆదేశం
- అవసరమైతే కలెక్టర్ కార్యాలయంలోనూ నామినేషన్లకు అవకాశం
- 27న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఎస్ఈసీకి సూచన

3 లో



# అర్హులందరికీ నామినేషన్ అవకాశం

- నిబంధనల్లో లేని ధ్రువపత్రాలు అడగొద్దు
- అభ్యర్థుల హక్కులకు భంగం కలగకూడదు
- నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు
- రిటర్నింగ్ అధికారులకు ఎస్ఈసీ సూచనలు

2 లో

**అమరావతి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లోని 19 మున్సిపాలిటీలను మినహాయించి మిగిలిన అన్ని మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా అధికారులను ఆదేశించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.
ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థుల నుంచి ఎన్‌వోసీ, నో డ్యూ సర్టిఫికెట్లు కోరాల్సిన అవసరం లేదని ఎస్ఈసీ స్పష్టం చేశారు.

# స్థానిక పోరులో గెలుపే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికల ఫలితాల వరకు ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని తెలిపారు. కూటమి పార్టీల నుంచి మంచి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు కలిగించేందుకు కోర్టులను ఆశ్రయిస్తూ అనేక పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితా, బీసీ రిజర్వేషన్లు, మెగా డీఎస్సీ, అమరావతి, పోలవరం వంటి అంశాలను ప్రస్తావిస్తూ గతంలో కూడా వైఎస్సార్‌సీపీ నేతలు న్యాయస్థానాలను ఆశ్రయించారని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుల విషయంలోనూ వైఎస్సార్‌సీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని చంద్రబాబు ఆరోపించారు. రాజకీయాల్లో న్యాయపరమైన వివాదాలతో ముందుకు సాగే వ్యక్తులు ఉంటే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు ఏర్పడతాయని వ్యాఖ్యానించారు. ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని వారి రాజకీయ విధానాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి పరిమిత సమయం మాత్రమే ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. అన్ని మున్సిపాలిటీలు, స్థానిక ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ నేతలు, అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉండాలని, ప్రతి ఓటరును కలుసుకుని పార్టీ విధానాలను వివరించాలని పిలుపునిచ్చారు.

కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. బూత్ స్థాయి నుంచి ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అభ్యర్థులకు అవసరమైన సహకారం అందిస్తూ ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

# ధరల భారం పడనీయొద్దు



**అమరావతి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్ నినో ప్రభావంతో దేశ వ్యాప్తంగా ధరల పెరుగుదల కన్పిస్తోందని... ఆ ప్రభావం నిత్యవసరాలపై పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ సమీక్షలో భాగంగా వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యవసరాల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుబజార్లలో ప్రభుత్వం తరపున అందిస్తున్న బియ్యం అమ్మకాలపై సీఎం ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని... కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయని అధికారులు వివరించారు. అలాగే దీపావళీ, సంక్రాంతి వంటి పండుగల సమయంలో కూడా రైతు బజార్లల్లో తక్కువ ధరకు ఫైన్ రకం బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలన్నారు. అలాగే ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, సామాన్యులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటులో మరింత పురోగతి సాధించాలని, ప్రస్తుతం జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని... దీన్ని మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకా తొమ్మిది లక్షల కనెక్షన్లను ఏర్పాటు చేయాలని... వీటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసేలా కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాలనలో టెక్నాలజీని పూర్తిగా ఉపయోగించుకుని ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని సీఎం పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగ్గా జరగాలన్నారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ నామినేషన్ అవకాశం



(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ అంశంపై స్పష్టత ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల్లో లేని అదనపు ధ్రువపత్రాలను అభ్యర్థుల నుంచి కోరడం సరికాదని పేర్కొన్నారు.

నామినేషన్ల దాఖలు సందర్భంగా అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీలకు స్పష్టం చేశారు.

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రిటర్నింగ్ అధికారులు అదనపు షరతులు, నిబంధనలు విధించకూడదని ఎస్ఈసీ పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, అభ్యర్థుల హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించాలని సూచించారు.

# శాంతిభద్రతలతోనే ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

**శాంతిభద్రతలతోనే పెట్టుబడులు :** ఆంధ్రప్రదేశ్ పోలీసులకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని చంద్రబాబు అన్నారు. గతంలో ఫ్యాక్షన్‌ను నియంత్రించడంలో, నక్సలిజాన్ని ఎదుర్కోవడంలో, మత కలహాలను అరికట్టడంలో పోలీసులు అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారని గుర్తుచేశారు. శాంతిభద్రతలు, అభివృద్ధి, ఉపాధి, ప్రజల సుఖసంతోషాలు పరస్పరం ముడిపడి ఉన్నాయని చెప్పారు. భద్రతపై నమ్మకం ఉన్న ప్రాంతాలకే పెట్టుబడులు వస్తాయని, పరిశ్రమలు ఏర్పాటై ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అందుకే తాను అధికారంలో ఉన్నప్పుడల్లా శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. ఇటీవల ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం దేశ భద్రతకు భంగం కలిగించే కుట్రలను ఛేదించి పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచిందని అభినందించారు. పోలీసు విధుల్లో ధైర్యంతోపాటు మానవత్వం కూడా అవసరమని సీఎం సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో వస్తారని, కొందరు భయంతో, మరికొందరు కన్నీళ్లతో వస్తారని చెప్పారు. వారి సమస్యలను సానుభూతితో విని, గౌరవంగా వ్యవహరించి, సత్వర పరిష్కారం చూపాలని కోరారు. పోలీసుల తక్షణ స్పందన ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని పేర్కొన్నారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని ఉపేక్షించకూడదని, రాజకీయాలు నేరస్థులకు రక్షణ కల్పించకూడదని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీలు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తత :** నేరాలకు పాల్పడే పద్ధతులు మారుతున్నందున దర్యాప్తు విధానాల్లోనూ మార్పులు రావాలని చంద్రబాబు అన్నారు. ఒక్క ఫోన్‌కాల్, లింక్, సందేశంతో జీవితకాలం కష్టపడి సంపాదించిన సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకున్నవారు సైతం ఈ మోసాలకు బలి అవుతున్నారని అన్నారు. నేరాలను ఛేదించడం పోలీసుల సమర్థతకు నిదర్శనమైతే, అవి జరగకుండా నివారించడం అత్యుత్తమ పోలీసింగ్ కు నిదర్శనమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను గుర్తించడంతోపాటు, డేటా విశ్లేషణతో వాటి వెనుక ఉన్న వాస్తవాలను వెలికి తీయాలని సూచించారు. డ్రోన్ల వినియోగాన్ని నిఘా సహా వివిధ అవసరాలకు విస్తరించాలని చెప్పారు. ఏఐ లాంటి సాంకేతికతను ఉపయోగించి దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ఏపీ పోలీసులే అగ్రగాములనే గుర్తింపు దేశవ్యాప్తంగా రావాలని ఆకాంక్షించారు. వెల్త్, హెల్త్, హ్యాపీ ఏపీ లక్ష్య సాధనలో పోలీసుల పాత్ర కీలకమని సీఎం పేర్కొన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ బృందం చేస్తున్న కృషిని అభినందించారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మహిళలకు భద్రత కల్పించ లేకపోతే ప్రయోజనం లేదని అన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే నేరస్థులు భయపడే పరిస్థితి తీసుకురావాలని సూచించారు.

**పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా :** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని, ప్రమాదాల నివారణకు




తీసుకుంటున్న చర్యల ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించాలని చెప్పారు. తీవ్ర ఒత్తిడితో పనిచేసే పోలీసులు యోగా, ధ్యానం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. పోలీసు అమర వీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పోలీసుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. అమరుల త్యాగాలకు ఘనమైన నివాళి అర్పించాలంటే ప్రజలకు నిరంతర భద్రత కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగల పూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తదితరులు అమర జవాన్ స్మృతిచిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. షహీద్ పుస్తక్ టోలీ, అమరులు వారు పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు సంస్మరణ నిధికి సీఎం విరాళం అందించారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాలు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి, ఫోరెన్సిక్, విపత్తు నిర్వహణ పరికరాలు, ఆక్టోపస్ సహా ఇతర విభాగాల ఆధునిక ఆయుధాల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. నిఘా వ్యవస్థలో డ్రోన్ల వినియోగాన్ని మరింత పెంచాలని అధికారులకు సూచించారు.

# కుట్రలతో ఎన్నికలను అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ఆశీర్వదించి కూటమికి పాలనా బాధ్యతలు అప్పగించారని వారు పేర్కొన్నారు. రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు భరోసా, నమ్మకం కల్పించడంతో పాటు ప్రశాంతంగా జీవించే పరిస్థితులు కల్పిస్తున్నామని తెలిపారు.

స్థానిక సంస్థల బలోపేతంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే 16వ ఆర్థిక సంఘం, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అందువల్ల నిర్దేశిత గడువులోగా ఎన్నికలు నిర్వహించి, స్థానిక సంస్థలకు స్వపరిపాలన అందించడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సంకల్పించినట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై బాధ్యత లేకుండా వైసీపీ తొలి రోజు నుంచే ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. ఇప్పటి వరకు వివిధ కోర్టుల్లో 59 సార్లు పిటిషన్లు దాఖలు చేసి ఎన్నికలను నిలిపివేయడానికి ప్రయత్నాలు చేసిందని పేర్కొన్నారు.

అన్ని అడ్డంకులు తొలగిపోయి ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో కూడా వైసీపీ పలు ప్రాంతాల్లో హింసను ప్రేరేపించిందని, పోలీసులపై దాడులకు పాల్పడిందని, ప్రజల కోసం నిర్మించిన రహదారులను తవ్వేసిందని వారు ఆరోపించారు.



ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నాలను వైసీపీ ఇంకా కొనసాగిస్తోందని విమర్శించారు.

ఎన్నికలు పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా జరగాలన్నదే కూటమి ప్రభుత్వ నిశ్చయమని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితులను కూడా వారు ప్రస్తావించారు. ఆ సమయంలో రాష్ట్రంలో అల్లకల్లోల పరిస్థితులు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ప్రతిపక్షాలు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకునే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. బలవంతపు ఏకగ్రీవాలు, ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలపై అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. తనకు భద్రత కల్పించాలని అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం ప్రత్యేక బలగాలతో భద్రత కల్పించిన విషయాన్ని వారు ప్రస్తావించారు.

ప్రస్తుతం రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్న సమయంలో వైసీపీ రాజకీయ కారణాలతో ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. ఇది ఆ పార్టీ రాజకీయ విధానాన్ని వెల్లడిస్తోందని పేర్కొన్నారు. కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు ప్రజాస్వామ్యంపై అచంచల విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. ఎన్నికలు నీతిగా, నిజాయితీగా, శాంతియుతంగా జరిగేలా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలను గౌరవిస్తామని పేర్కొన్నారు.

రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరగాలని, ప్రజలు తమకు నచ్చిన నాయకులను స్వేచ్ఛగా ఎన్నుకోవాలని, ప్రతి ఇంటికీ అభివృద్ధి ఫలాలు అందాలన్నదే కూటమి లక్ష్యమని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, పీవీఎన్ మాధవ్ తెలిపారు.

# జనసేన అభ్యర్థనకు ఎస్ఈసీ ఓకే




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న వేళ .... రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) కీలక నిర్ణయం తీసుకుంది. జనసేన పార్టీ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించే గుర్తుల జాబితా నుంచి 'బకెట్', 'పెన్ స్టాండ్' గుర్తులను తాత్కాలికంగా తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తమ పార్టీ అధికారిక గుర్తు అయిన 'గాజు గ్లాసు'ను ఈ రెండు గుర్తులు పోలి ఉన్నాయని, దీనివల్ల ఓటింగ్ సమయంలో ఓటర్లు గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందని జనసేన పార్టీ ప్రతినిధులు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. గత ఎన్నికల అనుభవాలను ఉటంకిస్తూ, ఓటర్లలో ఎలాంటి అయోమయం లేకుండా ఎన్నికలు పారదర్శకంగా జరగాలని కోరారు. జనసేన వాదనను పరిశీలించిన ఎస్ఈసీ, ఓటర్ల స్పష్టతకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రిటర్నింగ్ అధికారులు స్వతంత్రులకు గుర్తులు కేటాయించేటప్పుడు ఈ రెండు గుర్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ కేటాయించవద్దని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల జనసేన వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# పారా ఆసియాలో పసిడి పంట




- ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్‌కు మరో రెండు స్వర్ణాలు
- 100 మీటర్ల స్ప్రింట్‌లో సిమ్రాన్ మెరుపులు
- వరుసగా రెండో స్వర్ణంతో సత్తా చాటిన అథ్లెట్
- 54 పతకాలతో పట్టికలో భారత్‌కు నాలుగో స్థానం

**టోక్యో:** జపాన్ వేదికగా జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో భారత ఖాతాలో మరో రెండు స్వర్ణ పతకాలు చేరాయి. మహిళల టీ12 విభాగం 100 మీటర్ల స్ప్రింట్‌లో సిమ్రాన్ పసిడి పతకం సాధించింది.

మంగళవారం జరిగిన 200 మీటర్ల స్ప్రింట్‌లోనూ సిమ్రాన్ విజేతగా నిలిచింది. తాజాగా 100 మీటర్ల రేసులోనూ ప్రత్యర్థులను అధిగమించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. దీంతో ఈ పోటీల్లో వరుసగా రెండు స్వర్ణ పతకాలను సొంతం చేసుకుని సిమ్రాన్ ప్రత్యేక గుర్తింపు సాధించింది.

పురుషుల టీ47 విభాగం 100 మీటర్ల స్ప్రింట్‌లో భారత అథ్లెట్ దిలీప్ స్వర్ణ పతకాన్ని అందుకున్నాడు. మరోవైపు పురుషుల 400 మీటర్ల టీ35/38 విభాగంలో అకీరా నందన్ బానోతు రజత పతకాన్ని సాధించాడు. 51.25 సెకన్లలో రేసును పూర్తి చేసిన అకీరా రెండో స్థానంలో నిలిచాడు.

తాజా విజయాలతో పారా ఆసియా క్రీడల్లో భారత్ పతకాల సంఖ్య 54కు చేరింది. ఇందులో 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాల పట్టికలో భారత్ ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతోంది. భారత అథ్లెట్లు ఇదే జోరును కొనసాగిస్తే పతకాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



# నామినేషన్ల గడువు పెంపునకు నో

**అమరావతి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల గడువును మొత్తంగా పొడిగించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. 19 ప్రాంతాల్లో నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారంటూ వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం, ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

నామినేషన్ల గడువును మొత్తంగా వాయిదా వేయడం లేదా రాష్ట్రవ్యాప్తంగా పొడిగించడం సాధ్యం కాదని స్పష్టం చేసిన ధర్మాసనం, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారంటూ ఫిర్యాదులు చేసిన ప్రాంతాలకు మాత్రమే ఆదేశాలు వర్తిస్తాయని పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందా అనే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది.

నామినేషన్లను అడ్డుకున్నారంటూ కోర్టును ఆశ్రయించడం మినహా ఇతర మార్గాల్లో ఎక్కడా ఫిర్యాదులు అందలేదని ఎస్ఈసీ తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, సంబంధిత ఫిర్యాదులను పరిశీలించి గురువారంలోగా ఎస్ఈసీ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అవసరమైతే అభ్యర్థులకు కలెక్టర్ కార్యాలయంలోనూ నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించింది.

అభ్యర్థుల తుది జాబితా ప్రకటించే గడువును అక్టోబర్ 25 వరకు పొడిగించిన సుప్రీంకోర్టు, తన ఆదేశాల మేరకు ఎస్ఈసీ తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

**నామినేషన్ కేంద్రాల వద్ద ఘటనలపై వాదనలు :**



వైఎస్సార్‌సీపీ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఎస్ఈసీ తరఫు న్యాయవాదులు ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని, నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా సమస్యలు తలెత్తాయని వివరించారు. నామినేషన్ కేంద్రంలో జరిగిన కొన్ని ఘటనలకు సంబంధించిన అంశాలను కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

కొన్ని ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అదనపు భద్రతా చర్యలు చేపట్టాల్సి వచ్చిందని ఎస్ఈసీ తరఫు న్యాయవాదులు తెలిపారు. అంతర్రాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు, ఆయుధాల స్వాధీనం వంటి అంశాలను కూడా వారు ప్రస్తావించారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు.

**19 ప్రాంతాలపై ఎస్ఈసీ దృష్టి :** సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో నామినేషన్లకు సంబంధించి ఫిర్యాదులు అందిన 19 ప్రాంతాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కనిగిరి, దర్శి, పుంగనూరు, రాయచోటి, రాజంపేట, మైదుకూరు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, పిడుగురాళ్ల, తాడిపత్రి, గురజాల, కమలాపురం, దాచేపల్లి, జమ్మలమడుగు, తిరుపతి, బద్వేల్, పులివెందుల, కడప, గుత్తి ప్రాంతాల్లో నామినేషన్ల దాఖలు సందర్భంగా వచ్చిన ఫిర్యాదులను ఎస్ఈసీ పరిశీలించనున్నట్లు సమాచారం.

ఆయా ప్రాంతాల్లో నామినేషన్ల సందర్భంగా జరిగిన పరిణామాలు, అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం లభించిందా లేదా, భద్రతా పరిస్థితులు తదితర అంశాలపై నివేదికలను ఎస్ఈసీ తెప్పించుకుంటోంది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా పరిశీలన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**న్యాయ నిపుణులతో ఎస్ఈసీ సమీక్ష :** సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో విజయవాడలో రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు సమావేశమై తదుపరి కార్యాచరణపై సమీక్షించారు. న్యాయ నిపుణులతో చర్చించి కోర్టు ఆదేశాలను అమలు చేసే విధానంపై పరిశీలన జరిపారు. 19 ప్రాంతాలకు సంబంధించిన నివేదికలను తెప్పించుకుని వాటిని న్యాయపరంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**తీర్పును వైఎస్సార్‌సీపీ వక్రీకరిస్తోందన్న టీడీపీ :** సుప్రీంకోర్టు ఆదేశాలను వైఎస్సార్‌సీపీ వక్రీకరించి ప్రచారం చేస్తోందని టీడీపీ ఆరోపించింది. 19 ప్రాంతాల్లో నామినేషన్ల గడువు పొడిగించాలని సుప్రీంకోర్టు ఆదేశించినట్లు వైఎస్సార్‌సీపీ ప్రచారం చేస్తోందని టీడీపీ విమర్శించింది. అయితే ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని మాత్రమే ఎస్ఈసీకి కోర్టు సూచించిందని పేర్కొంది.

నామినేషన్లను మరోసారి స్వీకరించాలా, అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా కలెక్టర్ వద్ద దాఖలు చేసే అవకాశం కల్పించాలా అనే అంశాలను కూడా ఎస్ఈసీ పరిశీలించాల్సి ఉంటుందని టీడీపీ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల గడువును పొడిగించాలన్న ఆదేశాలు సుప్రీంకోర్టు ఇవ్వలేదని స్పష్టం చేసింది.

# పల్లె పోరుకు నామినేషన్ల ఘట్టం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఎన్నికలకు నేటి నుంచి ఈనెల 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. అభ్యర్థులు నిర్ణయించిన గడువులోగా తమ నామినేషన్ పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాల్సి ఉంటుం ది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను ఈనెల 24వ తేదీన అధికారులు పరిశీలిస్తారు. ఆ తర్వాత నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 27వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన వెంటనే బరిలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాను అధికారికంగా వెల్లడించనున్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన తర్వాత నవంబర్ 3వ తేదీన పోలింగ్ నిర్వహించబడుతుంది. తదనంతరం నవంబర్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తోంది.

# కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా విస్తృత ప్రచారం

## తెనాలి పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్సీ ఆలపాటి, మంత్రి మనోహర్ ఇంటింటి ప్రచారం







**తెనాలి, అక్టోబర్ 21:** తెనాలి పట్టణంలోని 11, 12, 13, 14, 15, 16, 17 వార్డుల్లో కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్ ఆయా వార్డుల్లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలతో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆలపాటి, మనోహర్ స్థానిక ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, పట్టణ అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు.

ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం ద్వారా పట్టణ అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరుతూ ఆయా వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

**ప్రజల ఆశీస్సులే విజయానికి బలం :** ఎన్నికల్లో ప్రజల మద్దతు అత్యంత కీలకమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందినప్పుడే అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లగలమని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వడం ద్వారా తెనాలి పట్టణ అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ముందుకు సాగడమే తమ ప్రచార లక్ష్యమని తెలిపారు. ప్రజల విశ్వాసమే నాయకులకు బలమని, అభివృద్ధి పథంలో తెనాలి పట్టణాన్ని ముందుకు తీసుకెళ్లడమే కూటమి లక్ష్యమని అన్నారు. ప్రజల ఆశీస్సులతో కూటమి అభ్యర్థులు విజయం సాధించి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు.

**ప్రజా సంక్షేమం, పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యం :** కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ వివరించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్ మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి ప్రజల సూచనలు, సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ప్రచార కార్యక్రమంలో కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా వార్డుల్లో నాయకులకు స్థానిక ప్రజలు స్వాగతం పలుకుతూ తమ స్పందనను తెలియజేశారు. దీంతో తెనాలి పట్టణంలో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది.




## స్థానిక పోరుపై ఎస్ఈసీ దృష్టి

**అమరావతి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం అప్రమత్తమైంది. ఏడు జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో నామినేషన్ల దాఖలుకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, వాటికి సంబంధించిన ఆధారాలు, ఇప్పటికే తీసుకున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

19 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారంటూ వైఎస్సార్‌సీపీ చేసిన ఫిర్యాదులపై సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎస్ఈసీ ఈ సమీక్ష నిర్వహించింది. సంబంధిత ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితులు, నామినేషన్ల సమయంలో నెలకొన్న పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పించిన అవకాశాలపై జిల్లా అధికారులతో చర్చించినట్లు సమాచారం.

సుప్రీంకోర్టు తీర్పు పూర్తి కాపీ అందిన అనంతరం దాని ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కోర్టు ఆదేశాల అమలుకు సంబంధించి న్యాయపరమైన అంశాలపై రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌తో ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా చర్చించినట్లు సమాచారం.

ఏడు జిల్లాల్లోని 19 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో తమ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ నామినేషన్ల గడువు పొడిగించాలని వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం, ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది.

ఇదే సమయంలో అక్టోబర్ 25న 19 పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి సమగ్ర వివరాలు సేకరించి, న్యాయపరమైన అంశాలను పరిశీలించిన అనంతరం తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు ఎస్ఈసీ కసరత్తు చేస్తోంది.

## తిరుమలలో సిఫార్సు లేఖలకు బ్రేక్



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల శ్రీవారి దర్శనం, వసతిపై టీటీడీ బోర్డు కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ నిబంధనల ప్రకారం తిరుమలలో ప్రముఖులు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే అన్ని రకాల సిఫార్సు లేఖల స్వీకరణను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత వరకు నిరంతరాయంగా ఈ ఆంక్షలు కొనసాగుతాయని బోర్డు తెలిపింది. సిఫార్సుదారుల లేఖల ద్వారా వచ్చే భక్తులకు దర్శనాలు, వసతి గదుల కేటాయింపును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. అయితే, ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే ముఖ్యాతిథులు, ప్రముఖులు స్వయంగా తిరుమలకు విచ్చేస్తే మాత్రం వారి పరిమితులకు లోబడి దర్శనం, వసతి సౌకర్యాలను కల్పిస్తామని టీటీడీ స్పష్టం చేసింది. భక్తులందరికీ సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎన్నికల నిబంధనలకు కట్టుబడి పని చేయడమే ప్రధాన ఉద్దేశమని టీటీడీ అధికారులు తెలిపారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులు ఈ మార్పులను గమనించాలని, ఎలాంటి సిఫార్సు లేఖలను తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

## పరిషత్ పోరులో తొలి రోజే ఉద్రిక్తతలు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ శ్రేణులతో కలిసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసు భద్రత మధ్య నామినేషన్ కేంద్రానికి తరలిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసరడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఇరువర్గాల నుంచి రాళ్లు విసరడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు, వేంపల్లి, చక్రాయపేట, అట్లూరు, బి.కోడూరు, బద్వేలు తదితర ప్రాంతాల్లో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం ప్రాంతాల్లో నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకోవడంతో పాటు నామినేషన్ పత్రాలు చించివేశారనే ఆరోపణలు వచ్చాయి. వేంపల్లిలో పార్టీ కార్యకర్తల కోసం సిద్ధం చేసిన భోజనాలను ధ్వంసం చేశారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. పులివెందులలో ద్విచక్ర వాహనం, ఆయిల్ మిల్లుకు నిప్పంటించడంతో పాటు అర్ధరాత్రి లారీ దగ్ధమైన ఘటనలు చోటుచేసుకున్నాయి.



పుంగనూరులో రాళ్లు, కర్రలతో దాడులు:లిలి అన్నమయ్య జిల్లా పుంగనూరులో నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. 16 ఎంపీటీసీ, ఒక జడ్పీటీసీ స్థానాలకు మున్సిపల్ హైస్కూల్‌లో నామినేషన్లు స్వీకరిస్తుండగా ఇరువర్గాలు పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులకు దిగాయి. ఈ ఘటనలో పలువురు టీడీపీ కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం.

రొంపిచర్లలో పోలీసుల లాఠీఛార్జ్:లిలి పల్నాడు జిల్లా రొంపిచర్లలో నామినేషన్ దాఖలు చేసేందుకు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పెద్ద సంఖ్యలో అనుచరులతో రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. నామినేషన్ కేంద్రం వద్ద భారీగా జనసమీకరణకు అనుమతి లేదని పోలీసులు సూచించడంతో వాగ్వాదం జరిగింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోలీసులను ప్రతిఘటించడంతో లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో నరసరావుపేట గ్రామీణ సీఐకు స్వల్ప గాయాలయ్యాయి. నరసరావుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద జడ్పీటీసీ అభ్యర్థి భర్తపై, పిడుగురాళ్లలో జడ్పీటీసీ అభ్యర్థి భారతి, ఆమె భర్త లక్ష్మారెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు సమాచారం.

రైల్వేకోడూరు, శ్రీకాళహస్తిలోనూ ఉద్రిక్తత:లిలి తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో నామినేషన్ల దాఖలుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలను కూటమి నేతలు అడ్డుకున్నారంటూ ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. శ్రీకాళహస్తిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు చెందిన బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు.

తొండంగిలో 144 సెక్షన్ నేపథ్యంలో ఘర్షణ:లిలి కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల సందర్భంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య తోపులాట జరిగింది. మాజీ మంత్రి దాడిశెట్టి రాజాతో కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రానికి చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పెద్ద సంఖ్యలో రావడానికి అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో వాగ్వాదం తలెత్తి ఉద్రిక్తతకు దారితీసింది.

అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ముందస్తు అరెస్టులు:లిలి పరిషత్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయగా, సత్యసాయి జిల్లా సీకేపల్లి మండలం మేడాపురంలో ఆయన సోదరుడు శేఖర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకే ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నూలు, ప్రకాశం జిల్లాల్లోనూ వివాదాలు:లిలి కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉల్చాల ఎంపీపీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన టీడీపీ, కమ్యూనిస్టు పార్టీల నాయకుల మధ్య వివాదం చోటుచేసుకుంది. కమ్యూనిస్టు నాయకులపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ఆరోపించారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థి గంగయ్యకు సంబంధించిన హైకోర్టు రిట్ పిటిషన్ పత్రాలను టీడీపీ నాయకులు చించివేశారనే ఆరోపణలతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఓటరు జాబితాలో పేరు లేకపోవడంతో గంగయ్య హైకోర్టును ఆశ్రయించగా, ఆయనకు ఓటు హక్కు కల్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ ఉత్తర్వులకు సంబంధించిన పత్రాలను అధికారులకు సమర్పించేందుకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం.

నామినేషన్ల తొలిరోజే పలు జిల్లాల్లో చోటుచేసుకున్న ఘటనలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం

- టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్

**మంగళగిరి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఎన్డీయే కూటమి అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ పిలుపునిచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వాల హయాంలో గ్రామీణ మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు.

టీడీపీ, కూటమి ప్రభుత్వాల హయాంలో రూ.38,852 కోట్లతో 77,083 కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లు నిర్మించగా, గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లలో గ్రామీణ రోడ్ల నిర్మాణం 884 కిలోమీటర్లకే పరిమితమైందని రాజేష్ పేర్కొన్నారు. వైసీపీ హయాంలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు దారి మళ్లించారని ఆరోపిస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.4,200 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ 3.0'లో రూ.11,085 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, ఉద్యాన పంటలు, మేజిక్ డ్రైన్లు, ఫార్మ్ పాండ్స్, తాగునీటి వసతులు వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో 'అడవి తల్లి బాట' ద్వారా రహదారి సౌకర్యాలు కల్పిస్తూ, గ్రామీణ ప్రాంతాలను మౌలిక వసతులతో అనుసంధానిస్తున్నామని వివరించారు.



గ్రామీణ అభివృద్ధికి కేంద్ర నిధులు అందాల్సిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయించే ప్రయత్నాలు జరిగాయని రాజేష్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను కొనసాగిస్తూ గ్రామాలు, పట్టణాలకు అభివృద్ధి నిధులు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, ఉపాధి వంటి అంశాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు పరిశీలించి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## ఉపరాష్ట్రపతి విజయవాడ పర్యటన.. మంత్రి సత్యకుమార్‌కు బాధ్యతలు



**అమరావతి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అక్టోబర్ 26న విజయవాడలో పర్యటించనున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉపరాష్ట్రపతికి స్వాగతం పలకడం, పర్యటనలో వెంట ఉండడం, వీడ్కోలు పలకడం వంటి బాధ్యతలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ప్రభుత్వం అప్పగించింది.

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపరాష్ట్రపతి కార్యాలయం నుంచి అక్టోబర్ 19న అందిన లేఖ ఆధారంగా ముఖ్యమంత్రి తరఫున ప్రతినిధిగా మంత్రి సత్యకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఉపరాష్ట్రపతి అక్టోబర్ 26న ఉదయం 10.05 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి అంబేద్కర్ కళావేదిక, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్మృతివనాన్ని సందర్శించనున్నారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.10 గంటల వరకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. విజయవాడ కార్యక్రమాలు ముగిసిన అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, మధ్యాహ్నం ఒంటిగంటకు తిరుపతికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత అతిథి గృహానికి వెళ్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి సమయం కేటాయించారు. అనంతరం తిరుపతిలోనే రాత్రి బస చేస్తారు. అక్టోబర్ 27న ఉదయం పద్మావతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి దర్శనం చేసుకోనున్నారు. అనంతరం ఉదయం 8.15 గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి 10.55 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 11.20 గంటలకు ఉపరాష్ట్రపతి నివాసానికి చేరుకోనున్నారు.

## టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన వైసీపీ సీనియర్ నేత, గుంటూరు పార్లమెంట్ వైసీపీ ఉపాధ్యక్షుడు, దుగ్గిరాల మాజీ ఎంపీపీ వడ్డేశ్వరపు రజనీకాంత్ నియోజకవర్గ శాసనసభ్యులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనతో పాటు 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఉండవల్లి నివాసంలో వీరందరికీ పసుపు కండువాలు కప్పి మంత్రి లోకేష్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**అభివృద్ధిని బేరీజు వేసుకుని కూటమి అభ్యర్థులను గెలిపించాలి :** ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మనందరం ఒక కుటుంబం. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. మంగళగిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, ఆసుపత్రి నిర్మాణంతో పాటు కమ్యూనిటీ భవనాలు, పార్కులు, అంగన్ వాడీ భవనాలు, లైబ్రరీలు, స్మశానాలు అభివృద్ధి చేస్తున్నాం. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి చేస్తున్నాం. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. 2024 ఎన్నికల కంటే స్థానిక ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ రావాలి. కూటమి అభ్యర్థులను గెలిపించాలి. అందరం ఎన్డీయే పక్షాన నిలబడాలి. అదే మనకు శ్రీరామరక్ష. అప్పుడే మనం అనుకున్న అభివృద్ధి సాధ్యం. ఇందుకు మీ అందరి సహకారం కావాలి. శాంతియుత వాతావరణంలో స్థానిక ఎన్నికలకు వెళ్దాం. కలిసికట్టుగా పనిచేద్దాం. గతంలో పదేళ్లు ఒకరికి అవకాశం ఇచ్చారు. రెండున్నరేళ్లు నాకు ఇచ్చారు. అప్పటికీ, ఇప్పటికీ జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి. మీకు అందుబాటులో ఉండి అహర్నిశలు పనిచేస్తానని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో చిలువూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, మంగళగిరి పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ యాళ్ల జయలక్ష్మి, టీడీపీ క్లస్టర్ ఇంఛార్జ్ చిలువూరి ఏసుపాదం, దుగ్గిరాల మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పినపాటి కరుణాకర్, యూనిట్ ఇంఛార్జ్ చిలువూరి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి క్షేత్రంలో వైభవంగా ఆయుధ పూజ

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ ఎస్పీఎఫ్ సిబ్బంది..



**యాదగిరిగుట్ట, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది ఆయుధ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ భద్రతను మరింత పటిష్ఠం చేయడంతో పాటు, భక్తులకు మెరుగైన రక్షణ కల్పించి విధులను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఎస్పీఎఫ్ సిబ్బంది ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జె.భవాని శంకర్, డీఈవో భాస్కర్, ఏఈఓ గజవెల్లి రఘు, సురేందర్ రెడ్డి, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రచార్యులు, ఉప ప్రధానార్చకులు లక్ష్మణాచార్యులు, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ కనకయ్య, రవి, అర్చకులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.



**నల్గొండ, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్):** నల్గొండ జిల్లాలో వెట్టిచాకిరిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మిక శాఖ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన స్వేచ్ఛ రథంను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరి, బానిసత్వం అనేవి అనాదిగా వస్తున్న సామాజిక రుగ్మతలని పేర్కొన్నారు. వీటి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రచార రథాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.ఈ ప్రచార రథాలు 20 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సంతలు, గ్రామ చావడీలు, జనసమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యటించి వెట్టిచాకిరి, బానిసత్వ నిర్మూలనపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాయని వివరించారు. కళాకారుల పాటలు, దృశ్యరూపకాలు, కరపత్రాలు, గోడపత్రికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.జిల్లా ప్రజలు వెట్టిచాకిరి పట్ల అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో వెట్టిచాకిరి అనే మాట వినిపించకుండా అందరూ సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వెట్టిచాకిరికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 08069434343కు తెలియజేయాలని కోరారు.వెట్టిచాకిరి, బానిసత్వ నిర్మూలనకు కార్మిక, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ తదితర శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని, అన్ని శాఖలు, ప్రజల సహకారంతో ఈ సామాజిక రుగ్మతను నిర్మూలించేందుకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, కార్మిక శాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, సహాయ కమిషనర్లు పి. అరుణ, సయ్యద్ మొయిజుద్దీన్, జిల్లా సంక్షేమ అధికారి లావణ్య, ఏహెచ్‌టీయూ అంజలి, సీడబ్ల్యూసీ చైర్మన్ చింతా కృష్ణ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి గణేష్, కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్టిచాకిరి నిర్మూలనపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు.

# ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలి

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు 300 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న 300 రోజులు అత్యంత కీలకమని, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని, ముఖ్యంగా డిసెంబర్, జనవరి నెలల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గ్రామాలు, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో వచ్చే ఆగస్టు వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

గ్రామపంచాయతీల్లో నీటి వనరులకు సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించాలని, నీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలను అరికట్టాలని, దెబ్బతిన్న పైపులు, ట్యాంకులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. పబ్లిక్ హెల్త్ శాఖ, మిషన్ భగీరథ, అమృత్ పథకం అధికారులతో సమన్వయం చేసుకొని నీటి సరఫరా ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లోనూ నీటిని పొదుపుగా వినియోగించే విధానాలను అమలు చేయాలన్నారు.వాహనాలను పైపులతో కడగకుండా బకెట్లలో నీటిని ఉపయోగించి శుభ్రం చేసుకునేలా ప్రజలకు



అవగాహన కల్పించాలని, దుకాణాలు, వాహనాల శుభ్రత కేంద్రాల్లో నీటి వృథాను నివారించాలని ఆదేశించారు. నీటిని వృథా చేసే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, నీటి కొరతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు.

**ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి**

ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందస్తు సూచనలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే వేరుశనగ, జొన్నలు, మినుములు, కందులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. 90 రోజుల్లో పండే పంటల గురించి వివరించాలని, రైతులు పండించిన పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**విద్యాసంస్థలు, వైద్య కేంద్రాల్లో నీటి నిల్వలను గుర్తించాలి**

జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలను తక్షణమే గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా నీటి కొరత ఉంటే భూగర్భ జల వనరులు, మిషన్ భగీరథ ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పిల్లలు, విద్యార్థులు, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

గ్రామాల్లో పశువులు, అటవీ జంతువులకు తాగునీటి కొరత ఏర్పడకుండా నీటి లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీరు అందక జంతువులు మృత్యువాత పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి**

పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పథకాలపై వివరించాలని, సోలార్ పంపుసెట్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలోనూ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. శేఖర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

**ప్రజావాణికి 49 ఫిర్యాదులు.**

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 21 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించి 28 ఫిర్యాదులు కలిపి మొత్తం 49 ఫిర్యాదులు అందాయి.

# మాజీ మంత్రి దామన్న విగ్రహావిష్కరణ

- ఆత్మీయ నేత విగ్రహం ముందు కన్నీటిపర్యంతమైన కొప్పుల వేణారెడ్డి.



**సూర్యాపేట, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి స్వర్గీయ టైగర్ రామ్‌రెడ్డి దామోదర్ రెడ్డి (దామన్న) విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, దామన్న అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ప్రాంగణం జన సంద్రంగా మారింది. స్వర్గీయ రామ్‌రెడ్డి దామోదర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దామన్నతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ మహోత్సవానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, దామన్న అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పలువురు నాయకులు దామన్నతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన ప్రజాసేవలను స్మరించుకున్నారు. స్వర్గీయ రామ్‌రెడ్డి దామోదర్ రెడ్డి విగ్రహం ముందు కొప్పుల వేణారెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమయ్యారు. తనకు అత్యంత ఆత్మీయుడైన నాయకుడి జ్ఞాపకాలను తలచుకుంటూ ఆయన కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడికి వచ్చిన అభిమానులను సైతం కదిలించింది. దామన్నతో తనకున్న సాన్నిహిత్యం, అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ వేణారెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు.స్వర్గీయ రామ్‌రెడ్డి దామోదర్ రెడ్డి మరణం సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల ప్రజలకు తీరని లోటుగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేసిన నాయకుడిగా దామన్న ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తుచేసుకున్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మరువలేమని అభిమానులు పేర్కొన్నారు.దామన్న విగ్రహావిష్కరణ మహోత్సవం ఆయన అభిమానులు, అనుచరులకు భావోద్వేగభరితమైన సందర్భంగా నిలిచింది. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వర్గీయ రామ్‌రెడ్డి దామోదర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలి

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.



**సూర్యాపేట, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** బాద్): విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు. దృఢమైన సంకల్పం, పట్టుదలతో ముందుకు సాగితే విజయం తప్పక సాధించవచ్చనే స్ఫూర్తిని విజయదశమి పండుగ అందిస్తుందని పేర్కొన్నారు.దుర్గాదేవి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని, ప్రతి ఒక్కరూ చేపట్టిన పనుల్లో విజయం సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూల ఆలోచనలు, అభివృద్ధి, విజయాలను తీసుకురావాలని కోరారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

- కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలి..
- బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి..



**గరిడేపల్లి, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యువత, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని వారు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడుస్తున్నా హామీల అమలులో ఆశించిన పురోగతి లేదని విమర్శించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు, గ్రూప్-1, పోలీస్ నియామకాలు, డీఎస్సీ, జీవో నంబర్ 46, జీవో నంబర్ 29 తదితర అంశాల్లో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు.

పట్టభద్రులంతా ఫామ్-18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలి

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన పట్టభద్రులందరూ ఫామ్-18 ద్వారా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. గరిడేపల్లి మండలంలోని గరిడేపల్లి, పొనుగోడు, గడ్డిపల్లి, కల్మలచెరువు, కీతవారిగూడెం సహా అన్ని గ్రామాలు, తండాల్లో డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ముఖ్యంగా మహిళా పట్టభద్రులు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువతకు ఓటు నమోదు ప్రాధాన్యతను వివరించాలని అన్నారు. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ తదితర నగరాల్లో నివసిస్తున్న పట్టభద్రులు కూడా తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఫామ్-18 సమర్పించాలని కోరారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రియాశీలక యువతను భాగస్వాములను చేసుకొని అర్హులైన పట్టభద్రులను సంప్రదించాలని సూచించారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలలో జాప్యం**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధుల విడుదలలో జాప్యం కారణంగా పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ రంగం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామని వారు పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేసిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై పట్టభద్రులు తమ ఓటు ద్వారా స్పందించాలని పిలుపునిచ్చారు.

**రైతు సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రైతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రైతులకు అనుకూలమైన విధానాలు అమలు చేశారని నాయకులు పేర్కొన్నారు. రైతును రాజు చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ రంగానికి అండగా నిలిచామని అన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. యాసంగి వ్యవసాయంపై రైతుల్లో ఆందోళన నెలకొనే పరిస్థితులు ఏర్పడ్డాయని, రైతులకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది బంగారు తెలంగాణగా మారాలంటే మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ప్రజలు, యువత, ఉద్యోగులు, రైతుల ఆకాంక్షలను నెరవేర్చగలిగే పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, కొప్పుల సైదిరెడ్డి, సురేష్ బాబు, మన్యం శ్రీనివాస్ రెడ్డి, కేఎల్ఎన్ రెడ్డి, కీతా రామారావు, సర్పంచులు మాశెట్టి శ్రీహరి, బొలిశెట్టి సుధీర్, బొల్లెపల్లి రామనాథం, సుధాకర్ నాయక్, మన్సూర్ అలీ, పెండెం ధనయ్య గౌడ్, రామ్ సైదులు, పెండెం వెంకట రాములు, కర్నాటి నాగిరెడ్డి, పెండెం వీరయ్య, తెలపాటి నరేష్, గుగులోతు నీలాహేమ్లా నాయక్, ఆనంద్ బాబు, పిడమర్తి అంజి, దాసరి ఆంజనేయులు, ప్రధాని సైదులు, నరేందర్ నాయక్, పిల్లి అంజయ్య తదితర ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్తీని అరికట్టాలి..

-సేంద్రియ పద్ధతిలో పంటలను పండించాలి.. - పురుగుమందులు వాడొద్దు
- సేంద్రియ సేద్యం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం, రైతుకు లాభం..
- ఎండీ అహ్మద్, యువసేవ అవార్డు విన్నర్..



**రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** నేడు మార్కెట్లో ఆహార పదార్థాలలో కల్తీ ఎక్కువైపోయింది. దీనిని అరికట్టాలంటే రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలను పండించాలి. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూమి సారం దెబ్బతినడమే కాకుండా, పండే పంట కూడా విషతుల్యంగా మారుతోంది. సేంద్రియ వ్యవసాయం వల్ల భూమికి బలం వస్తుంది, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. కంపోస్ట్ వంటి సహజ ఎరువులతో పంటలు పండిస్తే, ఆ పంట దిగుబడి ఆరోగ్యకరంగా ఉంటుంది. ఖర్చు కూడా తక్కువ అవుతుంది. ప్రభుత్వం సేంద్రియ రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలి. కల్తీ లేని ఆహారం తింటేనే ఆరోగ్యంగా ఉంటాం. కావున ప్రతి రైతు పురుగుమందులకు స్వస్తి చెప్పి, సేంద్రియ బాటలో నడవాలి.

## జర్నలిస్టు వడ్డూరి మృతికి టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం..

- నివాళులర్పించిన రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



**హైదరాబాద్, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటు తో మరణించిన సీనియర్ జర్నలిస్టు వడ్డూరి శ్రీనివాసరావు భౌతిక కాయానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం శ్రీనివాసరావు భౌతిక కాయానికి నాగోల్ స్మశాన వాటిలో అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియలకు హాజరైన మామిడి సోమయ్య శ్రీనివాసరావు భౌతిక కాయం పై పూలమాల ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్ కూడా శ్రీనివాసరావు కు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను మామిడి సోమయ్య పరామర్శించి ఓదార్చారు. నలభై ఏళ్ళుగా జర్నలిజం వృత్తిలో కొనసాగిన వడ్డూరి శ్రీనివాసరావు చివరిదాకా వృత్తిని నమ్ముకొని, నీతి నిజాయితీతో జీవించారని మామిడి సోమయ్య పేర్కొన్నారు. పలు ప్రధాన పత్రికల్లో సబ్ ఎడిటర్, సీనియర్ సబ్ ఎడిటర్ గా నిబద్ధతతో పని చేసిన శ్రీనివాసరావు మరణం మీడియా రంగానికి, జర్నలిజానికి తీరని లోటు అని అన్నారు. శ్రీనివాసరావు జర్నలిస్టుగా నలభై ఏళ్ళు పనిచేసినా ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం పొందలేకపోయారని, ఇంటి స్థలం కల నెరవేరకుండానే చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదరికంలో ఉన్న శ్రీనివాసరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



# నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

- దుర్గ భవాని విగ్రహ దాత సందీప్ కుమార్ పిలుపుమేరకు హాజరైన ఎమ్మెల్యే



**కౌడిపల్లి, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** కౌడిపల్లి మండలంలోని తునికి గ్రామ శివారులో కొలువుదీరిన శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శివప్ప, విఘ్నేష్ పంతులు ఆధ్వర్యంలో అర్చన కార్యక్రమం చేపట్టారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

అనంతరం కౌడిపల్లి మండల కేంద్రంలోని స్థానిక హనుమాన్ మందిరం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాభవాని అమ్మవారి మండపాన్ని సందర్శించారు. విగ్రహదాత మంగల్పర్తి సందీప్ కుమార్ ఆహ్వానం మేరకు అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాభవాని యూత్ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సారా రామా గౌడ్ బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మంగలపర్తి సందీప్ కుమార్ బి ఆర్ఎస్ పార్టీ మండల యువ నాయకుడు పోలా నవీన్ కుమార్ ఆయా గ్రామాల సర్పంచులు యశోద బాలకిషన్ బాకీ సుమలత గణేష్ హల్వాయిపేట పద్మహేల్లం రవి యాదవ్ శివానందరెడ్డి కుమ్మరి శివలీల సతీష్ కుమార్ కుతుబుద్దీన్ లక్ష్మి కుమార్ ధనరాజ్ ప్రవళిక రమేష్ మాజీ సర్పంచ్ దివ్య మహిపాల్ రెడ్డి సి డి సి మాజీ చైర్మన్ దుర్గారెడ్డి చిలుములరాజిరెడ్డి. బీస కాంత పురుషోత్తంగట్ల గౌరెడ్డి కాంతారావు నాయకోటి లింగం నాయకోటి శ్యాంసుందర్ సంజీవ్ మాజీ జడ్పిటిసి కవిత అమర్ సింగ్ రామాంజనేయులు మహబూబ్ రవి సాగర్ సంతోష్ కుమార్ తో పాటు పలువురు కార్యకర్తలు నాయకులు ప్రజలు తదితరులు ఉన్నారు.

# మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వం

- సెక్యులర్ వ్యవస్థకు తూట్లు
- ముస్లింకి ప్రభుత్వాలు ఇచ్చిన హామీలకై పోరాటం సాగించాలి
- ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం పిలుపు




**ఖమ్మం , అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దగ్గర నుండి మతోన్మాదాన్ని పెంచి పోసిస్తూ, అన్నదమ్ములు లాగా కలిసుండాల్సిన హిందూ, ముస్లిం మధ్య విద్వేషాలను సృష్టిస్తూ, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుదని ఇదీ సెక్యులర్ వ్యవస్థకు ప్రమాదకరమని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం కేంద్ర ప్రభుత్వన్ని హెచ్చరించారు. బురద రాఘవపురం గ్రామాల్లో జరిగిన ఇన్సాఫ్ గ్రామ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించకుండా, రూపాయి విలువ పతనం తో రోజూ, రోజూ కి దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అంబానీ, అదాని సంపద రోజూ రోజూ కి పెరుగుతుంటే సామాన్యుడు ఈ దేశంలో సామాన్యులు బ్రతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిపాలించడం చేత కానీ ప్రధాని దేశంలో ఉన్న హిందూ ముస్లిం మధ్య గొడవలను సృష్టిస్తూ ముస్లిం లు దేశ ద్రోహులుగా చిత్రీకరించి, దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నాడు. దేశంలో ఉన్న ముస్లింలు చాలా దుర్బర పరిస్థితులను ఎదుర్కుంటున్నారు.సరైన తిండి లేక,ఉండటనికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు సరైన విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఎన్నికల్లో ఓట్ల కోసం వాడుకొని వదిలేస్తున్నాయి. హామీలను నెరవేర్చాలని డిమాండు చేస్తే దేశ ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. సర్ పేరుతో ఉన్న ఓట్లును తీసివేస్తున్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి అక్రమ వలసదారులు , రోహింగాలు ఈ దేశలోకి వస్తున్నారని అంటున్నారు. సర్ పేరుతో ఎంత మందిని గుర్తించరో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పరిపాలన చేతకాక ముస్లిం లను శత్రువులుగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నాలను దేశ ప్రజలు ముఖ్యంగా ముస్లింలు ఐక్యం ఎదుర్కోవాలని పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దొండపాటి రమేష్ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్,నాయకులు మళ్ళెంపాటి కోటేశ్వరరావు, ముస్లిం పెద్దలు,గ్రామ పాల్గొన్నారు.అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షురాలు గా నన్నే సాహెబ్,అధ్యక్ష కార్యదర్శులు స్క్. షకీల్, భషీర్ ఎన్నుకున్నారు.విరుతో పాటు 10 మందితో కమిటీని ఏర్పాటు చేశారు.

# డీజే తో డేంజర్

- డిజే సౌండ్ తో ఆగిన గుండె
- చెరువుమాధారంలో విషాదం
- ఒకే గ్రామంలో 9 డిజేల ఏర్పాటు



**ఖమ్మం, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** డీజే శబ్దంతో వినగానే ఊపు వస్తుంది. నిర్వహాకులకు వినసోంపుగా ఉన్నా, వినే వారికి మాత్రం డేంజర్ అది. ఒక్కోసారి అది ప్రాణంతకంగా కూడ మారే అవకాశం లేకపోలేదు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని చెరువుమాదారం గ్రామంలో బతుకమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా 15 కేంద్రాలలో బతుకమ్మ ను నిర్వహించారు. ముగింపు సందర్భంగా పోటీలు పడి డిజేలను ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవం లో పాల్గొనేందుకు మండలం లోని అప్పలనరసింహాపురం గ్రామానికి చెందిన యలగాల భారతి (50) అనే "తన సమీప బంధువుల ఇంటి వద్దకు వచ్చారు. గ్రామంలో జరిగేబతుకమ్మ సంబురాలలో పాల్గొన్నారు. అందరూ డిజే సౌండ్లతో ఆటా, పాటలతో సందడి చేస్తున్నారు. ఈ వేడుకలను చూసేందుకు వచ్చిన భారతి అత్యంత భయంకరమైన శబ్దం కలిగిన డిజే సౌండ్ కు భారతి కుప్పకూలింది. సహాచరులు వెంటనే వైద్యం కోసం నేలకొండపల్లి. తరలించారు. కానీ అప్పటికే మృతి చెందిందని వైద్యులు పేర్కొన్నారు. దసరా పండుగ కు అన్న ఇంటికి వచ్చిన భారతి డిజే సౌండ్తో అనంతలోకాలకు వెళ్లింది. అప్పటి వరకు ఆనందోత్సవాలా మధ్య ఉన్న బతుకమ్మ సంబురాలు విషాదం అలుముకుంది. అమె మృతితో ఇటుచెరువుమాదారం, అటో అప్పలనరసింహాపురం లో విషాదం అలుముకుంది. గ్రామంలో ఒకే రోజు ఉత్సవం జరుపుతుండటంతో ఇక్కడ డిజేల కొరత ఉండటంతో ఏపీ నుంచి డిజేలు తెప్పించారు. ఉత్సవాల పేరుతో అత్యంత భయకరమైన డిజే సైండ్లతో గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తుంటే చిన్న పిల్లలు, వృద్ధులు, గుండె సంబంధిత జబ్బులు కలిగిన వారంతా ప్రాణాలను భయం గుప్పిట్లో పెట్టుకుని గడిపామని పలువురు పేర్కొంటున్నారు.— పోలీసులు చెబుతున్నారు, వదిలేస్తున్నారు వినాయక చవితి, దుర్గాదేవి, బతుకమ్మ ఉత్సవం ఏదైనా సరే. డిజే లేకుంటే బంధువులు, స్నేహితులు వచ్చే పరిస్థితి లేదు. తాజాగా బతుకమ్మ, దుర్గాదేవి విగ్రహాల వద్ద డిజేలతో నృత్యాలు, ఆటా, పాటలతో సందడి చేస్తున్నారు. సందడి బాగానే ఉంది. కానీ అది ప్రమాదకరంగా మారుతుంది. వేడుకలకు డీజేలకు అనుమతి లేదని పోలీసులు హెచ్చరించి వదిలేస్తున్నారు. దీంతో నిర్వహాకులుపాటలతో సందడి చేస్తున్నారు. సందడి బాగానే ఉంది. కానీ అది ప్రమాదకరంగా మారుతుంది. వేడుకలకు డీజేలకు అనుమతి లేదని పోలీసులు హెచ్చరించి వదిలేస్తున్నారు. దీంతో నిర్వహాకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెరువుమాధారం లో ఇంత పెద్ద ఎత్తున డిజేలు ఎలా పెట్టారు. వారికి అనుమతి ఉందా ఓ మహిళ మృతి కి కారకులు ఎవరూ అనే ప్రశ్న అందరిని వేదిస్తుంది.

# చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం

- కబ్జాకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించం
- రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సత్వరమే సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలి
- సహజ జల వనరుల పరిరక్షణే లక్ష్యంగా కార్యాచరణ
- నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు





**సుజాతనగర్, కొత్తగూడెం, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని, కబ్జాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. సుజాతనగర్ మండల పరిధిలోని సర్వారం - కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ. 2 కోట్ల నిధులతో నిర్మించనున్న డార్మిటరీ బ్లాక్, కిచెన్ షెడ్ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన శంకుస్థాపన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, రైతులకు జీవనాధారమైన సహజ జల వనరులు, చెరువు భూములను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దర్జాగా ఆక్రమించుకోవడం గర్హనీయమన్నారు. నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన చెరువుల భూములను గుర్తించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రతి చెరువుకు పక్కాగా హద్దులు నిర్ణయించి, కబ్జాలను తొలగించి జల వనరులను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. చెరువుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి, విద్యావ్యాప్తికి పెద్దపీట వేస్తున్నామని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వారి పరిస్కారంకోసం కృషిచేస్తున్నామన్నారు. సుజాతనగర్ మండలానికి ఇంటర్ వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయించడం జారింది గుర్తుచేశారు. సర్వారం - కోయగూడెం ఆశ్రమ పాఠశాల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మేయర్ మూడ్ గణేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లాల్ సింగ్, సొసైటీ ఛైర్మన్ మండే హన్మంతరావు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడివో భారతి, ఐటిడీఏ ఈఈ మధుకర్, ఏఈ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, సర్పంచ్ రామనాధం, నాయకులు భూక్య దస్రు, సిపిఐ మిత్రపక్షల నాయకులు కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన పేరుతో ప్రజా వ్యతిరేక పాలన

- ఎన్నికల హామీలు గాలికి, రైతులు, ప్రజలు సమస్యల సుడిగుండంలో
- అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం
- బీజేపీ కిసాన్ మోర్చా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది





**ఖమ్మం , అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల ముందు ప్రజా పాలన అందిస్తామని, రైతులకు అండగా ఉంటామని, ప్రతి వర్గం సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవ్యవస్థ, అసమర్థత, నిర్లక్ష్య పాలనను మాత్రమే అందిస్తోందని బీజేపీ ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు.ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అదే ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఖమ్మం ఎస్సీ విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నరుకుల్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు తమ సొంత బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేస్తున్నప్పటికీ పంటలను కాపాడుకునే కీలక సమయంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు చేపట్టకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు.ఒకవైపు గోదావరి జలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ మరోవైపు రైతుల పొలాలకు సాగునీరు అందకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.రైతులకు రక్షణగా ఉండాల్సిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎండిపోతున్న పంటలకు వెంటనే నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు.— ధర్నా అనంతరం ఎస్ఈకి వినతిపత్రం ధర్నా కార్యక్రమం అనంతరం బీజేపీ ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా నాయకులు విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) ని కలిసి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైన సమయంలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ అంతరాయాలను వెంటనే నివారించాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.రైతులు పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు.— అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలంరైతుల సమస్యలతో పాటు రాష్ట్రంలో వ్యవసాయం, విద్యుత్, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం, మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని నాయకులు విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టి కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలను గాలికొదిలేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా విధానంగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలకే జవాబుదారీగా ఉండాలని, ప్రజల సహనాన్ని పరీక్షిస్తే రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించకపోతే బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి రైతుల పక్షాన పోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు తెప్పాల లక్ష్మీ రెడ్డి, బీజేపీ నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు చావా కిరణ్, మండేపూడి నాగేశ్వరరావు, ఆపతి వెంకట రామారావు, జ్వాలా నరసింహారావు బెల్లం మురళి, మద్దినేని సతీష్, కొమ్మినేని కృష్ణారావు, వెంకటనారాయణ యాదవ్ బొల్లా రాంబాబు రవి గౌడ్పుప్పాల చంద్రమౌళి, మీగడ గోపి, కోటి హనుమంతరావు, రుద్రగాని మాధవ్, మృత్యుంజయరావు తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# త్రాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి : రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల
## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- నీటిని పొదుపుగా వాడుకోవాలి
- ఈర్లపూడి చెరువును పరిశీలించిన మంత్రి




**ఖమ్మం, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వాడుకోవాలని, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి సోమవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాగార్జున సాగర్ జలాల ఆధారంగా, మంచుకొండ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసి ఈర్లపూడి చెరువును నింపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే సమీప కాలంలో వర్షాలు పడే సూచనలు తక్కువగా ఉన్నందున నీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులోని నీటిని తాగునీటి  అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ వాడుకోవాలని సూచించారు. రైతులు నీటి అవసరం చాలా తక్కువతో సాగయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలని, వరి, మొక్కజొన్న లాంటి పంటలు సాగుచేయవద్దని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, నీరు, కరంట్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి అన్నారు. ప్రజలకు, పశు పక్ష్యాదులకు త్రాగునీరు ఎంతో ముఖ్యమని, నీటిని, కరంట్ ను పొదుపుగా వాడుకోవాలని మంత్రి తెలిపారు. ఈ పర్యటనలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# వైరా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం
- వైరా మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన గ్రామాతోపాటు పట్టణ పేదలకు ఉపాధి పని కల్పించాలి
- 14 రకాల నిత్యావసర వస్తువులు చౌక దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేయాలి
- ప్రజావాణిలో స్థానిక తహసీల్దార్ సిహెచ్ సురేష్ బాబుకు వినతి



**ఖమ్మం, వైరా, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** వైరా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సోమవారం ప్రజావాణిలో స్థానిక తహసీల్దార్ సిహెచ్ సురేష్ బాబుకు తెలంగాణ రైతు సంఘం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) వైరా డివిజన్బ్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వైరా సాగనీటి ప్రాజెక్టును దృష్టిలో పెట్టుకొని వైరా కరువు మండలంగా ప్రకటించకపోవడం బాధాకరం అన్నారు* ఖరీఫ్ సీజన్ లో వర్షాలు పడక పోవడంతో వైరా మండలంలోని నల్ల చెరువు (సోమవరం) నిండక దాదాపు 100 ఎకరాల భూమిలో వరి పంట వేయలేదని, దీంతోపాటు  వైరా ప్రాజెక్టు నుండి సాగునీరు వస్తుందా రాదా అనే సందేహంతో ప్రాజెక్టు రైతులు వరి విత్తనాలు ఆగస్టు చివర నుంచి సెప్టెంబర్ 15 దాకా చల్లుకున్నారని, ఆలస్యం అయినా సన్న రకాలకు బోనస్ వస్తుందని రైతులంతా సన్న రకాలు చల్లడం వలన చివర భూములకు నీరు అందక చివరకు పూర్తిస్థాయిలో పంట చేతికి వచ్చే అవకాశం లేదని, దీనివలన ప్రాజెక్టు రైతులకు వందల ఎకరాల పంట నష్టం జరుగుతుందని, దీర్ఘకాలంలో జరిగే నష్టాన్ని అంచనా వేయకుండా, సాగునీటి అవకాశం ఉందని పైపైన చూచి వైరా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం సరైనది కాదని అన్నారు. వర్షాలు లేక కలుపులు ఎక్కువగా రావడం వలన కలుపు మందులు కొట్టి పెట్టుబడి కూడా బాగా పెరిగిందని, అందువలన రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయిలో చివర భూముల వరకు సమగ్ర పరిశీలన చేసి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని, అదే విధంగా ఈ ఖరీఫ్ లోనేకాదు ఈ కరువు ప్రభావం వ్యవసాయం, పేద ప్రజలపై ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వమే లెక్కలు చెబుతుందని, అందువలన వైరా మున్సిపాలిటీలో వీలినమైన గ్రామాలతో పాటు పేదలకు ఉపాధి పని కల్పించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం పేదలకు 14 రకాల నిత్యవసర వస్తువులను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, డివిజన్ కమిటీ సభ్యులు తూము సుధాకర్,  తెలంగాణ రైతు సంఘం పట్టణ కార్యదర్శి కొంగర సుధాకర్, నాయకులు పైడిపల్లి సాంబశివరావు గుడిమెట్ల రజిత, బాజోజు రమణ, కిలారి శ్రీనివాసరావు, ఎస్.కె నాగుల్ పాషా, కారుమంచి జయరాజు, ముత్తమాల విజయరాజు, వెదుల పుల్లయ్య, రుద్రాక్షల వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలతో మిన్నంటిన కొత్తగూడెం 14,15వ డివిజన్లు భారీ సంఖ్యలో హాజరైన మహిళలు యువతులు






**ఖమ్మం, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఖమ్మం నగరంలో 14, 15వ డివిజన్ల పరిధిలో గల కొత్తగూడెంలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక సీపీఐ శాఖ కార్యాలయం ఎదుట సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఆద్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్ని తాకాయి. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ ఆడ పడుచులు ఎంతో ఇష్టపడే ఈ బతుకమ్మ పండుగ సందర్భంగా, వివిధ రకాల రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను వద్దకు తీసుకొచ్చి మహిళలు, యువతులు సాంప్రదాయ వస్త్రధారణలో మెరుస్తూ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ భక్తిభావంతో సాగిన గౌరమ్మ పాటలు, కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక 14, 15వ డివిజన్ల మహిళలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.  బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా మార్మోగిందని ఆనందం వ్యక్తం చేశారు. పూల బతుకమ్మలను సాయంత్రం వేళ సామూహికంగా నిమజ్జనం చేసే కార్యక్రమంతో వేడుకలు కన్నులపండువగా ముగిశాయని తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను సమున్నతంగా చాటే ఈ వేడుకలు అందరిలోనూ సరికొత్త ఉత్సాహాన్ని నింపాయన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల హనుమంత రావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, భూమా రాంమూర్తి, సీతల సత్యం, లక్కా వీరయ్య, పోతురాజు వెంకటేశ్వర్లు, పగడాల శ్రీను, పర్వత సైదులు, మాకనబోయిన నాగేశ్వర రావు, ములకలపల్లి అచ్చయ్య, భూమా జాను, తుపాకుల శ్రీకాంత్, కోటేశ్వరరావు, నాగరాజు, షేక్. ఫకీర్, చింతకాయల లక్ష్మినారాయణ, పగడాల వెంకటేశ్వర్లు, అమరారపు ఉపెందర్, చింతకాయల హనుమంతరావు, నాగటి నరేష్, దంతాల శ్రీకాంత్, పగడాల చంద్రశేఖర్, చాగంటి వెంకట నర్సయ్య, లింగం సూరి, భూమా ఉపెందర్, అమరారపు వెంకటమ్మ, లక్క రేణుకా, దంతాల రాధ,త్రీవేణీ, మాకనబోయిన పార్వతి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్ల అనుసంధానం, అభివృద్దే ధ్యేయం

- పల్లెలకు మౌలిక వసతుల కల్పనలో రాజీపడేదిలేదు
- రూ.10 కోట్లతో రేగళ్ల - కరకవాగు బిటి రోడ్డును నిర్మిస్తున్నాం
- గతంలో ఎన్నడూ లేని రీతిలో నియోజకవర్గ అభివృద్ధి
- నాణ్యతతో గడువులోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- రేగళ్ల - కరకవాగు రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే




**కొత్తగూడెం, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ రోడ్ల అనుసంధానం, అభివృద్దే ధ్యేయంగా నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తాను ప్రత్యేక చొరవతో మంజూరు చేయించిన లక్ష్మీదేవిపల్లి - పాల్వంచ మండలాలను అనుసంధానించే 5 కిలో మీటర్ల మేర బిటి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రేగళ్ల నుంచి పెద్దతండా, ఉయ్యాల బాడవ, హరియతండా, గేట్ తండా మీదుగా కరకవాగు వరకు రూ. 10 కోట్ల వ్యయంతో సాగుతున్న పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మారుమూల గిరిజన గూడేలు, తండాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో పల్లె బాటలను వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చూడటమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, తహసీల్దార్ సరితా, ఎంపిడివో సుస్మిత, అధికారులు రఘురామయ్య, స్థానిక నాయకులు, సర్పంచులు దీటి లక్ష్మీపతి, కంటెం శ్రీనివాస్, దారా శ్రీనివాస్, జర్పుల ఉపేందర్, తాటి లక్ష్మణ్, రాంబాబు, బాలాజీ, రమేష్, హత్తిరామ్, పూర్ణ, రాంబాబు, కంటెం శ్రీను,  రామన్న, వీరబాబు,  మాధవరావు, ఎస్ కె నాణ్య, ఓంజీ, బానోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఘనంగా ఆయుధ పూజ, వాహన పూజ

- వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




**ఖమ్మం , అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** దుర్గామాత నవరాత్రులలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆయుధ పూజ, వాహన పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయుధ పూజ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను ప్రత్యేకంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆయుధ పూజ మన సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయుధాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, క్రమశిక్షణ, అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం పోలీస్ వాహనాలకు వాహన పూజ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అత్యవసర సమయాల్లో ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించే పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమమైన స్థితిలో ఉంచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బందికి అన్న ప్రసాదాలను వడ్డించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు, ఆర్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 28న పోలింగ్ సందర్భంగా సెలవు



**గుంటూరు, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర పాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘానికి ఈ నెల 28వ తేదీన పోలింగ్ ఉన్నందున సెలవును ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ నిర్వహించే ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు ఎన్నికల సంఘం స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని చెప్పారు. ఎన్నికలు నిర్వహించనున్న ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాల ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా స్థానిక సెలవు ప్రకటించినట్లు వివరించారు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం, 1881 పరిధిలోకి వచ్చే పోలింగ్ ప్రాంతాల్లో సైతం ఇది వర్తిస్తుందని చెప్పారు. పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు రోజున – అక్టోబర్ 27, 28, 30 తేదీల్లో – పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగిస్తున్న అన్ని ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థల భవనాలు, ఇతర భవనాలకు స్థానిక సెలవులు ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు.

## ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై ఇద్దరు ఆప్కాస్ ఉద్యోగుల తొలగింపు

- **కఠిన చర్యలు తప్పవు: నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్**

**గుంటూరు, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఇద్దరు ఆప్కాస్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ తెలిపారు. సంబంధిత ఉద్యోగులను ఆప్కాస్ ఉద్యోగుల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఆప్కాస్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్‌కు లేఖలు పంపినట్లు వెల్లడించారు.

జీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆప్కాస్ విధానంలో అన్‌స్కిల్డ్ వర్కర్‌గా పనిచేస్తున్న ఈదులమూడి సరోజినిదేవి ఉద్యోగానికి రాజీనామా చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికల్లో 67వ వార్డు (శారదకాలనీ) నుంచి కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగంలో కొనసాగుతూ ఎన్నికల్లో పోటీ చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమెను ఆప్కాస్ ఉద్యోగుల జాబితా నుంచి తొలగించాలని ఆప్కాస్ ఎండీకి లేఖ పంపినట్లు తెలిపారు.

అదేవిధంగా తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో ఆప్కాస్ విధానంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న షేక్ అంజాతుల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీ అభ్యర్థిని కలిసి సంఘీభావం తెలిపినట్లు, అనంతరం ఆమెకు అనుకూలంగా బహిరంగ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని మయూర్ అశోక్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయ ప్రచారంలో పాల్గొనడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొంటూ, సదరు ఉద్యోగిని కూడా ఆప్కాస్ జాబితా నుంచి తొలగించాలని ఆప్కాస్ ఎండీకి లేఖ పంపినట్లు చెప్పారు.

## వసంతోత్సవంతో ముగిసిన వాసవి అమ్మవారి దసరా మహోత్సవాలు



- **ఊరేగింపులో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, చిన్నారులు**

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** మండల కేంద్రంలోని స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు పది రోజులపాటు వాసవి అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇవ్వడమైనది. ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు మరియు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పది రోజులపాటు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడమైనది 11వ రోజు అమ్మవారికి వసంతోత్సవంతోపాటు సాయంత్రము పాన్పు సేవతో దసరా ఉత్సవాలు ముగిసాయి అని ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు తెలిపారు.

## మల్లేపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా చిలమల లక్ష్మీదేవి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల వ్యాప్తంగా తొలి రోజు 18 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అందులో మల్లెపల్లె పంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థిగా చిలమల లక్ష్మీదేవి నామినేషన్ దరఖాస్తు ఫారాన్ని రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ షర్మిల నారాయణ పాల్గొన్నారు.

## బ్రాహ్మణ ప్రముఖులతో ఎమ్మెల్సీ ఆలపాటి భేటీ

- **కూటమి అభ్యర్థి విజయానికి సహకరిస్తామని హామీ**



**తెనాలి, అక్టోబర్ 20 (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి పట్టణానికి చెందిన బ్రాహ్మణ ప్రముఖులతో శాసన మండలి సభ్యుడు, మాజీ మంత్రి, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం సమావేశమయ్యారు. తెనాలి టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు.

20వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన తాడేపల్లి సూర్యనారాయణమూర్తి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని సమావేశంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. దీనికి సూర్యనారాయణమూర్తి సమ్మతి తెలిపినట్లు తెలిపారు.

కూటమి అభ్యర్థి విజయానికి కలిసి పనిచేస్తామని సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ ప్రముఖులు ఏకగ్రీవంగా హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బ్రాహ్మణులకు అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.

సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, బ్రాహ్మణ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల స్థూపానికి ఎస్పీ వకుల్ జిందాల్ నివాళి

- **అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశమై సమస్యలపై ఆరా**



**గుంటూరు, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గుంటూరులోని పాలెం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పోలీసు అమరవీరుల స్థూపం వద్ద జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు అధికారులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కార్యక్రమంలో ఆర్ఎస్ఐ, ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అదనపు ఎస్పీ రమణమూర్తి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, వెస్ట్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, నగరంపాలెం సీఐ ఆరోగ్యరాజు, ట్రాఫిక్ సీఐలు, ఆర్ఐ వెల్ఫేర్ సురేష్‌బాబు, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు.

అనంతరం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో అమరవీరుల కుటుంబ సభ్యులతో ఎస్పీ సమావేశమయ్యారు. వారి కుటుంబ పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను జ్ఞాపికలతో సత్కరించారు.

కార్యక్రమంలో పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పీసీ దేవదానం కుమారుడు, సీఐ బ్రహ్మయ్య కుమారుడు, పీసీ రవిబాబు కుమార్తె, హెచ్‌సీ జి. రామ్‌మోహన్‌రావు భార్య, పీసీ కృష్ణారెడ్డి భార్య, పీసీ రాజకుమార్ భార్య, హోంగార్డు ఆర్. వెంకటేశ్వర్లు భార్య, కుమార్తె, ఏఆర్ పీసీ ఐ. వెంకటేశ్వర్లు భార్య మాధవి, ఏఆర్ పీసీ వై. మస్తాన్‌బాబు భార్య కవిత, పీసీ శ్రీనివాసరావు భార్య, ఎస్ఐ టి. వెంకటేశ్వర్లు భార్య, పీసీ ఉమర్ కుమారుడు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఉద్యోగులు ఎన్నికల నిబంధనలు పాటించాలి

- **నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి: కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్**

**గుంటూరు, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆర్టీ నెం.1288, ఎంఏ–యుడీ శాఖ, తేదీ 17-10-2026 ప్రకారం ఉద్యోగులు ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఓటు హక్కు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని, అయితే ఎవరికి ఓటు వేశారనే విషయాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచాలని సూచించారు. ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రచారాలు, రాజకీయ సభలు, ర్యాలీల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని, తమ అధికార హోదాను ఏ రాజకీయ పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా ఉపయోగించకూడదని ఆదేశించారు. ఉద్యోగులు తమ వాహనాలు, నివాస గృహాలు లేదా శరీరంపై రాజకీయ పార్టీ గుర్తులు, రంగులను ప్రదర్శించరాదని తెలిపారు.

అలాగే ఏ అభ్యర్థికి ఎలక్షన్ ఏజెంట్‌గా, పోలింగ్ ఏజెంట్‌గా లేదా కౌంటింగ్ ఏజెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏపీ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన చట్టాల ప్రకారం చర్యలు, జరిమానా విధించే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగి ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తే మూడు నెలల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. బూత్ క్యాప్చరింగ్, ఓటర్లను బెదిరించడం వంటి చర్యలు తీవ్రమైన ఎన్నికల నేరాలుగా పరిగణించబడతాయని, నిబంధనల ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.

ఎన్నికల కోడ్, ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్, 1964 ప్రకారం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించే ఉద్యోగులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని కె.మయూర్ అశోక్ తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులు తమ బాధ్యతలను చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని సూచించారు.

## ఆర్టీసీ జేఏసీ ఉద్యమాలకు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ మద్దతు

- **విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి**







**విజయవాడ, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీఎస్ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్న విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ పరిరక్షణ, ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఆర్టీసీ జేఏసీ చేపట్టిన ఉద్యమాలకు తమ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 22, 23 తేదీల్లో ఔట్‌సోర్సింగ్ కార్మికులు విధులకు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరై నిరసన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

రాష్ట్ర అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించడం, డిపోలను ఖాళీ చేయించి ఆర్టీసీకి చెందిన విలువైన స్థలాలను లీజుల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే చర్యలు సంస్థ ప్రయోజనాలపై ప్రభావం చూపుతాయని అన్నారు. ఈ పరిణామాలు వేలాది మంది ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజా రవాణా వ్యవస్థగా ఆర్టీసీని పరిరక్షించడంతో పాటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే అంశాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించి, సంస్థ ప్రయోజనాలతో పాటు కార్మికుల భవిష్యత్తుకు భంగం కలగకుండా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ వారి ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సేవా సంబంధిత సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ పరిరక్షణ కోసం ఉద్యోగ సంఘాలు చేపట్టే న్యాయమైన పోరాటాలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యంగా మద్దతు ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు. లిఆర్టీసీ పరిరక్షణే లక్ష్యంగా, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా ఉద్యమాలను కొనసాగిస్తామనిలి స్పష్టం చేశారు.

## గుంటూరు మేయర్ బరిలో 14 మంది

- **నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో తుది జాబితా విడుదల**

**గుంటూరు, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు నిలిచారు. ఈ నెల 28న జరగనున్న ఎన్నికలకు సంబంధించి బుధవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ ప్రకటించారు.

మేయర్ పదవికి తెలుగుదేశం పార్టీ తరఫున లక్ష్మీ అపర్ణ కోవెలమూడి, బహుజన్ సమాజ్ పార్టీ తరఫున గూడవల్లి మణికుమారి, భారత జాతీయ కాంగ్రెస్ తరఫున చొప్పరపు పద్మావతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తాడికొండ అలివేలు వెంకట నాగ పద్మశ్రీదేవి పోటీ చేస్తున్నారు.

అమరావతి పార్టీ తరఫున దేగల మౌనిక, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున పఠాన్ మునీర్ సుల్తానా, నవోదయం పార్టీ తరఫున పెండ్యాల మాధవి, నవతరం పార్టీ తరఫున షేక్ ఖాదర్ బీ, రీఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున షేక్ మహ్మద్ జహూరున్నీసా బేగం బరిలో ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థులుగా కందేపల్లి అపర్ణ, గంజి సువర్ణలత, జరుగుమల్లి జ్యోతి, మన్నె సుధ, సీవాలసెట్టి పావని పోటీ చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికావడంతో మేయర్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులపై స్పష్టత వచ్చింది.

ఈ నెల 28న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

## తొలిరోజు 18 నామినేషన్లు



- **టీడీపీ నుంచి 18 నామినేషన్లు దాఖలు**

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** స్థానిక సంస్థ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. బ్రహ్మంగారిమఠం మండలంలో బుధవారం తొలి రోజు 18 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ పార్టీ తరఫున 18నామినేషన్లు నమోదయ్యాయి. ఇతర పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థుల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. మండలంలో మొత్తం 11 పంచాయతీలు ఉండగా ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. రానున్న రెండు రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశముంది. అని రిటర్నింగ్ ఆఫీసర్ నాగయ్య తెలిపారు.

## మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో 50 వేలు ఆర్థిక సహాయం అందచేసిన కొమ్మారెడ్డి కిరణ్



- **గోపాలరావు కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా కృషి చేస్తాం: కొమ్మారెడ్డి కిరణ్**

**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామంలో రైతు గోపాలరావుకు చెందిన పశువుల పాకలో జరిగిన అగ్నిప్రమాదంలో ఒక గేదె మృతి చెందగా, మరో 7 నుంచి 10 గేదెల వరకు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటనలో సుమారు రూ. 15 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. ఈ ఘటనపై టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ స్పందిస్తూ, పశువుల పెంపకంపై ఎంతో మక్కువతో జీవనం సాగిస్తున్న రైతు గోపాలరావుకు ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. ఉన్నత జాతుల గేదెలు, ఆవులను వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఎంతో శ్రద్ధగా పెంచుకుంటున్న రైతు కుటుంబం అగ్నిప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిందని పేర్కొన్నారు. పశువులే జీవనాధారంగా ఉన్న గోపాలరావు కుటుంబానికి జరిగిన నష్టాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని కొమ్మారెడ్డి కిరణ్ తెలిపారు.

ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందేలా కృషి చేస్తామని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిర్రావూరు తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, గ్రామ ఉపాధ్యక్షులు మక్కపాటి వెంకట కృష్ణారావు, గ్రామ ప్రధాన కార్యదర్శి కొంకా ముసలయ్య, వెలువోలు సుబ్బారావు, లింగాల వీరయ్య, నల్లిబోయిన శ్రీనివాసరావు, వీరిశెట్టి బాజీ, వెలువోలు సతీష్, దావులూరు అనిల్, పరిమిశెట్టి రోహిణి, దేవభక్తుని శ్రీనివాస్, జెట్టి రవి, కాటూరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బి.మఠం నూతన ఎంపీడీవోగా వరప్రసాద్



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల నూతన ఎంపీడీవో గా పగడాల వరప్రసాద్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఉన్న ఎంపీడీవో వై. రామచంద్రారెడ్డి మైలవరం ఇన్చార్జిగా పోవడంతో, ఇక్కడికి ఇన్చార్జి ఎంపీడీవోగా సీతారామిరెడ్డిని నియమించడం జరిగింది. ఆయన వచ్చిన వారానికే ఆరోగ్య కారణాల వల్ల వెళ్లిపోవడంతో తిరిగి రాజంపేట నుంచి పి.వరప్రసాద్ ను (ఎఫ్ఏసి) నియమించడంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

## 4,581 ఎంబిబియస్ ప్రవేశాల్లో 3,543 సీట్లు రిజర్వ్‌డ్ తరగతుల వారికే

- **ప్రతిభ కలిగిన రిజర్వ్‌డ్ విద్యార్థులకు 1,213 ఓపెన్ కేటగిరీ సీట్లు**
- **రిజర్వుడు తరగతుల వారికి సీట్ల కేటాయింపు పై దుష్ప్రచారాన్ని ఖండించిన డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ**

**అమరావతి అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రస్తుతం జరుగుతున్న ఎంబిబియస్ ప్రవేశాల్లో మూడు రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తయ్యే నాటికి మొత్తం 4,581 కన్వీనర్ కోటా సీట్లలో 3,543 ( 77.34 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు చెందిన విద్యార్థులకు కేటాయించినట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వెల్లడించింది. బుధవారంనాడు జారీ చేసిన ఒక పత్రికా ప్రకటనలో ఎంబిబియస్ ప్రవేశాలకు సంబంధించి అవలంబించిన విధానాలను, కేటాయింపు వివరాలను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్ వివరించారు. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులకు ఎంబిబియస్ సీట్ల కేటాయింపులపై కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన ఖండించారు.

**ప్రతిభ ఆధారంగా రిజర్వుడు విద్యార్థులకు ఓసీ కేటగిరీ సీట్ల కేటాయింపులో పెరుగుదల:** 2026-27 విద్యా సంవత్సరంలో నీట్-యూజీ పరీక్ష ఆధారంగా జరుగుతున్న ఎంబిబియస్ ప్రవేశాల్లో ప్రతిభ కనబరచిన రిజర్వుడు విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో సీట్ల కేటాయింపులో భారీ పెరుగుదల ఉన్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

మూడు కౌన్సిలింగ్ ల అనంతరం ప్రస్తుత ఎంబిబియస్ ప్రవేశాల్లో ఓపెన్ కేటగిరిలోని మొత్తం 2,026 సీట్లలో 1,213( 59.87 శాతం) సీట్లు ప్రతిభ ఆధారంగా రిజర్వుడు వర్గాల వారికి కేటాయించడం జరిగింది. 2025-26లో ఈ సంఖ్య 981 (51.57 శాతం) గా మాత్రమే ఉంది.

ఈ నేపథ్యంలో ఈ ఏడాది జారీ అయిన జీఓ 102 మేరకు రిజర్వుడు తరగతుల వారికి ఎంబిబియస్ ప్రవేశాల్లో అన్యాయం జరుగుతున్నట్లు కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, అది ఖండనీయమని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. మెరిటోరియస్ రిజర్వుడు కేటగిరీ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో ప్రవేశాలు పొంది వదులుకున్న సీట్లను ఆయా రిజర్వుడు వర్గాలవారితోనే నియమాల మేరకు భర్తీ చేయాల్సి ఉంటుందని, ఆవిధంగానే చేయడం జరిగిందని రిజిస్ట్రార్ వివరించారు.

దీనికి అదనంగా రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ కింద ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

**ఆప్షన్ల మేరకే ఎంఆర్‌సి సీట్ల కేటాయింపు:** ఎంబిబియస్ ప్రవేశాల్లో రిజర్వుడు వర్గాల విద్యార్థులు సూచించిన వెబ్ ఆప్షన్ల మేరకే నిబంధనల ప్రకారం ప్రతిభ ఆధారిత సీట్ల కేటాయింపులు మెరిటోరియస్ రిజర్వుడు కేటగిరీ కింద జరుగుతాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ఇటీవల రాష్ట్ర హైకోర్టుకు కూడా తెలియజేశామని ఆయన తెలిపారు. ఈ అంశం ఉన్నత న్యాయస్థానం పరిశీలనలో ఉన్నా కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేయడం పట్ల రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్ తీవ్ర అభ్యంతరాన్ని వెలిబుచ్చారు.

ఎంతో ప్రతిష్ట కలిగిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం పూర్తిగా నియమ నిబంధనల మేరకు పకడ్బందీగా ప్రవేశాలు చేపడుతున్నా దురుద్దేశ పూర్వకంగా అసత్య ప్రచారం చేస్తూ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల్లో అపోహలు కల్పించడానికి ప్రయత్నించడం దురదృష్టకరమని, ఇకనైనా అట్టి ప్రయత్నాలను మానుకోవాలని రిజిస్ట్రార్ కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సుప్రీంకోర్టు ఆదేశాలను వక్రీకరిస్తున్న వైసీపీ



○ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య

**మంగళగిరి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** సుప్రీంకోర్టు ఆదేశాలను వైసీపీ, సాక్షి మీడియా వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆరోపించారు. 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల గడువు పెంచాలని సుప్రీంకోర్టు ఎలాంటి బ్లాంకెట్ ఆర్డర్ ఇవ్వలేదని, ఎన్నికల ప్రక్రియను నిలిపివేయలేదని ఆయన పేర్కొన్నారు.
హింస, అక్రమాల కారణంగా నామినేషన్ వేయలేకపోయామని ఆధారాలతో ఫిర్యాదు చేసే నిర్దిష్ట అభ్యర్థుల ఫిర్యాదులను మాత్రమే పరిశీలించి, అవసరమైతే చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిందని వర్ల రామయ్య తెలిపారు. అందరికీ నామినేషన్ల గడువు పొడిగించాలని కోర్టు చెప్పలేదని, ఎన్నికల షెడ్యూల్‌లోనూ ఎలాంటి మార్పు చేయలేదని స్పష్టం చేశారు.
జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించలేదని వర్ల రామయ్య పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై తుది నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘానిదేనని కోర్టు స్పష్టం చేసిందన్నారు. నిర్దిష్ట ఫిర్యాదులను పరిశీలించేందుకు మాత్రమే అవసరమైన వెసులుబాటు కల్పించిందని, దీనిని ఎన్నికల ప్రక్రియ నిలిపివేతగా ప్రచారం చేయడం సరికాదన్నారు.
సుప్రీంకోర్టు ఆదేశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని వర్ల రామయ్య కోరారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా రాజ్యాంగబద్ధమైన రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయాలను గౌరవించాలని, తప్పుడు ప్రచారాలతో అభ్యర్థులు, ప్రజలను అయోమయానికి గురిచేయవద్దని ఆయన అన్నారు.

## 23న అల్పపీడనం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తమిళనాడు తీరానికి సమీపంలోని నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని, థాయిలాండ్ గల్ఫ్, దానిని ఆనుకుని ఉన్న థాయిలాండ్, మయన్మార్ ప్రాంతాల్లోని నిస్పటి ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. ఉత్తర అండమాన్ సముద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని, ఆ తర్వాత పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈ నెల 23న ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తూర్పు, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు పేర్కొన్నారు. ఈ అల్పపీడనం వాయవ్య దిశగా కదులుతూ, తదుపరి 3 రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. వీటి ఫలితంగా కోస్త ఆంధ్రప్రదేశ్, యానాం, రాలయసీమల్లో గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేక ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి, రెండు చోట్ల సంభవించే అవకాశం ఉందన్నారు. బలమైన ఈదురు గాలులు గంటలకు 30 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

## పోలీసు అమరులకు జగన్ నివాళి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వైఎస్ జగన్ పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. దీనిపై బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రజల రక్షణ కోసం వారు చేసిన అత్యున్నత త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, అమరవీరుల శౌర్యం, త్యాగాలు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి నిరంతరం స్ఫూర్తినివ్వాలని తెలిపారు. ప్రజలను రక్షించడంలో, శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీసులు అత్యున్నత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. నిజాయితీ, ధైర్యం, అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలన్న స్ఫూర్తిని పోలీసు అమరవీరుల నుంచి పొందాలి అని జగన్ పేర్కొన్నారు.

## విజయవాడలో భారీగా బంగారం, విదేశీ కరెన్సీ పట్టివేత



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డీఆర్ఐ అధికారులు, పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. విజయవాడ శివారులో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అయితే ఓ స్కార్పియోలో తరలిస్తున్న బంగారం, విదేశీ కరెన్సీ చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. దుండగులు బంగ్లాదేశ్ నుంచి కోల్ కతా మీదుగా హైదరాబాద్‌కు బంగారం స్మగింగ్ చేస్తున్నారు. స్కార్పియో వాహనం రహస్య అరలో 60 వేల అమెరికన్ డాలర్లు, 21,500 యూరోలను తరలిస్తున్నారు. మొత్తం రూ.5.84 కోట్ల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
అలాగే హైదరాబాద్ వైపు బస్సులో వెళ్తున్న ముగ్గురు బంగారం క్యారియర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నడుముకు కట్టుకున్న పౌచ్‌లో బంగారాన్ని గుర్తించారు. ముగ్గురి నుంచి 3.147 కిలోల బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం : ఎమ్మెల్సీ ఆలపాటి

○ జనసేన, బీజేపీకి కేటాయించిన 21 వార్డుల్లో టీడీపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి



**తెనాలి, అక్టోబర్ 20 (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి పట్టణంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, తెనాలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం తెనాలి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జనసేన, బీజేపీకి కేటాయించిన 21 వార్డులకు చెందిన టీడీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మిత్రపక్షాలైన జనసేన, బీజేపీకి కేటాయించిన వార్డుల్లో టీడీపీ నాయకులు సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. ఆయా వార్డుల్లో ఎన్నికల బాధ్యతను టీడీపీ నాయకులు భుజాన వేసుకుని అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. ఎక్కడా విపరీత ధోరణులకు తావులేకుండా అభ్యర్థులతో పాటు జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలని సూచించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతతో పనిచేస్తే ప్రతి వార్డులో విజయాన్ని సాధించగలమని అన్నారు. సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, మంగమూరి హరిబాబు, జొన్నాదుల మహేష్, నన్నపనేని సుధాకర్, వసంతం అశోకవర్ధన, తాడిబోయిన హరిప్రసాద్, కొల్లూరి శ్రీధర్, జనసేన 20వ వార్డు అభ్యర్థి బండారు రవికాంత్, కోగంటి రోహిత్, మల్లవరపు విజయ్, గిరి గణేష్, కొండా రమాదేవి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు మద్దతు.. భారీ మెజారిటీతో గెలిపిస్తాం

○ ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్, లాఫింగ్ క్లబ్ సభ్యుల మద్దతు



**గుంటూరు, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర మేయర్ పదవికి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీమతి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు నగర ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఉదయం ఎన్టీఆర్ స్టేడియాన్ని సందర్శించిన ఆమె వాకర్స్, లాఫింగ్ క్లబ్ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా సభ్యులు కూటమికి, లక్ష్మీ అపర్ణకు తమ మద్దతు ప్రకటిస్తూ ఆమెను భారీ మెజారిటీతో గెలిపిస్తామని భరోసా ఇచ్చారు.

**వాకర్స్‌తో ఆత్మీయ పలకరింపులు**

ఎన్టీఆర్ స్టేడియంలో నడక, వ్యాయామం చేస్తున్న వారిని కలుసుకున్న లక్ష్మీ అపర్ణ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన సౌకర్యాలపై వారితో చర్చించారు. ప్రజల అభిప్రాయాలను శ్రద్ధగా వింటూ, అందరితో కలిసిమెలిసి సాగిన ఆమె పర్యటన వాకర్స్‌లో ఉత్సాహాన్ని నింపింది.
ఈ సందర్భంగా వాకర్స్, లాఫింగ్ క్లబ్ సభ్యులు లక్ష్మీ అపర్ణకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటామని, రానున్న ఎన్నికల్లో ఆమె విజయానికి కృషి చేస్తామని తెలిపారు. భారీ మెజారిటీతో గెలిపించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

**షటిల్ కోర్టులోనూ సందడి**

వాకర్స్‌తో ఆత్మీయంగా ముచ్చటించిన అనంతరం లక్ష్మీ అపర్ణ ఎన్టీఆర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియం షటిల్ కోర్టును సందర్శించారు. అక్కడ క్రీడాకారులు, క్రీడాభిమానులతో కలిసిపోయి షటిల్ ఆడుతూ సందడి చేశారు. వారితో సరదాగా గడుపుతూ ఉత్సాహాన్ని నింపారు. ప్రజలతో మమేకమవుతూ, వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ నగర అభివృద్ధికి కట్టుబడి ముందుకు సాగుతాననే సంకేతాన్ని ఆమె పర్యటన ద్వారా అందించారు.
ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం సెక్రటరీ వజ్జా రామకృష్ణ, 46వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి జంపని ఫకీరయ్య, లాల్ వజీర్, పాకలపాటి ఉమామహేశ్వరరావు, యామిని, రత్తయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## భవానీ మాలధారులతో ఇంద్రకీలాద్రి కిటకిట



**విజయవాడ, అక్టోబర్ 21(జర్నలిస్ట్ ఫైల్):** దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిసినా ఇంద్రకీలాద్రిపై భక్తుల సందడి కొనసాగుతోంది. భవానీ దీక్షల విరమణ కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ నుంచి వేలాది మంది భవానీ మాలధారులు విజయవాడకు తరలివచ్చారు. దీంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు ఎర్రని వస్త్రధారణలో ఉన్న భవానీ మాలధారులతో భక్తిమయంగా మారాయి.
విజయదశమి సందర్భంగా అమ్మవారికి నిర్వహించిన రాజరాజేశ్వరి దేవి అలంకరణను గురువారం కూడా కొనసాగించారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత భవానీ మాలధారులకు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సామాన్య భక్తులతో పాటు భారీ సంఖ్యలో భవానీలు తరలిరావడంతో కొండపై, ఘాట్ రోడ్లపై రద్దీ తీవ్రంగా పెరిగింది. కాలి నడకన, వివిధ వాహనాల్లో తరలివచ్చిన భవానీలతో ఇంద్రకీలాద్రి పరిసరాలు కిక్కిరిసిపోయాయి.
మండల, అర్ధమండల దీక్షలను నియమనిష్ఠలతో పూర్తి చేసిన అనంతరం అమ్మవారికి ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించడం భవానీలకు ఆనవాయితీ. సాధారణంగా కార్తీక మాసంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అయితే ఈసారి దసరా రోజుల్లోనే పెద్ద సంఖ్యలో భక్తులు భవానీ మాలలు ధరించి ఇంద్రకీలాద్రికి చేరుకోవడంతో ఊహించని స్థాయిలో రద్దీ ఏర్పడింది. కొండపైకి వెళ్లే మార్గాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా భవానీ మాలధారులే కనిపించారు.

**నామస్మరణతో మార్మోగిన ఘాట్ రోడ్లు**

'జయ జయ భవానీ.. దుర్గా భవానీ' అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆలయ ప్రాంగణం, ఘాట్ రోడ్లు మార్మోగాయి. భారీ రద్దీ కారణంగా కాలి నడకకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడగా, భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. దర్శనానికి సుమారు ఐదు నుంచి ఆరు గంటలకు పైగా సమయం పడుతున్నప్పటికీ భవానీ మాలధారులు ఓపిగ్గా క్యూలైన్లలో నిలబడి అమ్మవారి దర్శనం కోసం వేచి చూశారు.
రద్దీ తీవ్రంగా ఉండటంతో భక్తులకు అమ్మవారి దర్శనం కొద్ది సేపటికే పరిమితమైంది. దీంతో కొంత అసౌకర్యానికి గురైనప్పటికీ భక్తులు క్యూలైన్లలో ముందుకు సాగారు. కొండపైకి భారీ సంఖ్యలో చేరుకుంటున్న భవానీలను పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లతో నియంత్రించారు. తాళ్లతో క్యూలైన్లను క్రమబద్ధీకరిస్తూ తోపులాటలకు అవకాశం లేకుండా భక్తులను దశలవారీగా దర్శనానికి అనుమతించారు.

**రద్దీ మధ్య సేవలకు ఆటంకం**

భక్తుల కోసం దేవదాయశాఖ మంచినీరు, పాలు, అల్పాహారం, బిస్కెట్లు తదితర సదుపాయాలను ఏర్పాటు చేసింది. అయితే భారీగా పెరిగిన భవానీల రద్దీ కారణంగా సరఫరా వాహనాలు క్యూలైన్ల వద్దకు చేరుకోవడంలో ఆలస్యం జరిగింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో భక్తులకు ఆహారం, తాగునీరు అందించేందుకు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవానీ మాలధారుల భారీ రాకతో విజయవాడ నగరం భక్తులతో కిక్కిరిసిపోయింది. మరోవైపు సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు నేతృత్వంలో అధికారులు కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఇంద్రకీలాద్రి పరిసరాల్లో రద్దీని నిరంతరం పర్యవేక్షించారు.

## దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



○ నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో పోలీసు అమరవీరుల స్మారక స్థూపం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి అక్టోబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్):** దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బుధవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో పోలీసు అమరవీరుల స్మారక స్థూపం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మంత్రి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రత కోసం పోరాడి అమరులైన పోలీసుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలకు రక్షణ కల్పిస్తూ నేరాల నియంత్రణకు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమని అన్నారు.
శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించడం ద్వారా పెట్టుబడులు వెల్లువెత్తడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేరాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ, చట్టం ముందు అందరూ సమానులేననే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలకు భద్రత, సమాజానికి ప్రశాంతత, రాష్ట్రానికి అభివృద్ధి లక్ష్యంగా పోలీసు శాఖ అంకితభావంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని వారు ఆశించిన శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, సమాజం ఎల్లప్పుడూ అండగా నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగు దేశం పార్టీ నాయకులు రామకృష్ణ, చౌదరి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అండతో వైసిపి అభ్యర్థులపై దాడులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైసిపి అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా టిడిపి గూండాలు అడ్డుకుంటున్నారని వైసిపి స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఇంటిపై దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. నామినేషన్లు విత్ డ్రా చేసుకోవాలని బెదిరిస్తున్నారని, లేదంటే కేసులు పెడుతున్నారని తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసుల అండతో వైసిపి అభ్యర్థులపై దాడులు చేస్తున్నారని, గంజాయి కేసులు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు. వైసిపి అభ్యర్థులపై కేసులు పెట్టి ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఆహ్వానిస్తున్నామని, వాటిని ఎస్ఈసి పాటిస్తుందని భావిస్తున్నామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా లెక్కచేయడం లేదని, టిడిపి గూండాలకు పోలీసులు వంత పాడుతున్నారని పేర్కొన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని, మొత్తం 11 జిల్లాల్లో 76 ఘటనలు జరిగాయని వివరించారు. దాడులు చేస్తూ నామినేషన్ పేపర్లు లాక్కుంటున్నారని, ఓటమి భయంలో టిడిపి వాళ్లు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్ డైరక్షన్‌లోనే ఇదంతా జరుగుతోందని పేర్కొన్నారు. తమ వైపు నుండి ఎక్కడా దాడులు లేవని అన్నారు. మాజీ డిప్యూటీ సిఎం నారాయణ స్వామి కారుపై దాడి చేశారని, సీనియర్ దళిత నాయకుడిపై టిడిపి కార్యకర్తలు దాడి చేశారని అన్నారు. దుగ్గిరాల మండల నాయకుడిపై పిడి యాక్టు పెట్టారని అన్నారు. దాడులు చేస్తున్న వారికి పోలీసులే రక్షణ కల్పిస్తున్నారని సజ్జల విమర్శించారు.

## జాతీయ సరస్ మేళాలో రూ.7 కోట్ల వ్యాపారం

○ దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు విశేష ఆదరణ

○ కుటుంబ సమేతంగా మేళాను సందర్శించి మహిళా సాధికారతకు తోడ్పడండి

○ ఎన్టీఆర్ జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ.ఎన్.వి. నాంచారరావు




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడలోని పున్నమి ఘాట్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎన్టీఆర్ జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ.ఎన్.వి. నాంచారరావు తెలిపారు. ఇప్పటివరకు మేళాలో సుమారు రూ.7 కోట్ల వ్యాపారం జరిగినట్లు వెల్లడించారు.
సాధారణంగా ఢిల్లీ, నోయిడా, గుర్గావ్ వంటి ప్రాంతాల్లో నిర్వహించే జాతీయ స్థాయి సరస్ మేళాను తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించడం విశేషమని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు, చేతివృత్తుల కళాకారులు ఈ మేళాలో పాల్గొంటూ తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయిస్తున్నారని తెలిపారు.

**587 స్టాళ్లలో వివిధ రకాల ఉత్పత్తులు:** మేళా ప్రాంగణంలో మొత్తం 587 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు నాంచారరావు తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళల కోసం 210 స్టాళ్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. మహిళలు తయారు చేసిన హస్తకళలు, చేనేత వస్త్రాలు, టెక్స్‌టైల్స్, వివిధ రకాల ఆహార ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.
స్వయం సహాయక సంఘాల మహిళలకు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు స్టాళ్లను ఉచితంగా కేటాయించడం ద్వారా వారికి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. జాతీయ సరస్ మేళా మహిళల ఆర్థిక స్వావలంబనకు, గ్రామీణ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించేందుకు దోహదపడుతోందని వివరించారు.

**50 స్టాళ్లతో ప్రత్యేక ఫుడ్ కోర్ట్ :** వివిధ రాష్ట్రాల సంప్రదాయ రుచులను ప్రజలకు పరిచయం చేసేందుకు కుడుంబశ్రీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 50 స్టాళ్లతో ఫుడ్ కోర్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రత్యేక ఆహార పదార్థాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సందర్శకులు ఒకే ప్రాంగణంలో వివిధ రాష్ట్రాల ఆహార సంస్కృతులను ఆస్వాదించే అవకాశం ఉందన్నారు.

**సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు :** మేళాకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు నాంచారరావు తెలిపారు. ప్రాంగణ పరిశుభ్రత కోసం 470 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. అగ్నిమాపక, విద్యుత్, వైద్య, పోలీస్, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. మేళాకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, ప్రజలందరూ ఉచితంగా సందర్శించవచ్చని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

**మహిళా సాధికారతకు ప్రజలు సహకరించాలి :** నగరవాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి జాతీయ సరస్ మేళాను సందర్శించాలని నాంచారరావు కోరారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళల ప్రతిభను ప్రోత్సహిస్తూ, స్థానిక ఉత్పత్తులకు ఆదరణ కల్పించడం ద్వారా మహిళా సాధికారతను బలోపేతం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com